గురువారం
16-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 144
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మహారాష్ట్రలో 'జికా' అలర్ట్

ముంబై: మహారాష్ట్రలో జికా వైరస్ కలకలం రేపింది. పూనేలోని యరవాడకు చెందిన 64 ఏళ్ల మహిళకు జికా వైరస్ పాజిటివ్ వచ్చింది. దీనిని అధికారులు నిర్ధారించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై కలెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్లకు తగు ఆదేశాలు జారీచేసింది. ముందు జాగ్రత్త చర్యలను చేపట్టాలని సూచించింది. కర్నాటకలో జికా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మహారాష్ట్ర ఆరోగ్య శాఖ ఉమ్మడి డైరెక్టర్ ప్రతాప్ సింగ్ సర్నాయకర్ లేఖ రాశారు. బాధిత మహిళ కేరళకు వెళ్లి వచ్చారని, అక్కడే ఆమెకు వైరస్ సోకి ఉంటుందని అనుమానిస్తున్నారు.

మృత్యు లోయ

- కశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- 300 అడుగుల లోతులోకి బస్సు బోల్తా
- 38 మంది దుర్మరణం, 19మందికి తీవ్ర గాయాలు

శ్రీనగర్: కశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు లోతైన లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 38 మంది దుర్మరణం చెందారు. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. దోడా జిల్లా బాటోటె-కిష్త్వార్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న

- మిగతా 2 లో

ఫైనల్‌కు భారత్

- ప్రపంచ కప్ సెమీస్‌లో కివీస్‌పై ఘన విజయం
- 7 వికెట్లతో అదరగొట్టిన షమీ
- సెంచరీలతో చెలరేగిన కోహ్లీ, అయ్యర్
- చివరి వరకు పోరాడిన మిచెల్

ఐసీసీ ప్రపంచకప్ అందుకోవడానికి టీమిండియా ఒక్క అడుగు దూరంలో నిలిచింది. బుధవారం ఇక్కడి వాంఖడే స్టేడియంలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లు విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ చెలరేగగా....ఏడు వికెట్లు పడగొట్టి కివీస్ పతనాన్ని శాసించిన భారత పేసర్ మహమ్మద్ షమీ టీమిండియా విజయంలో ముఖ్య భూమిక పోషించాడు. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై టీమిండియా నిర్దేశించిన 398 పరుగుల విజయాన్ని అందుకోవడంలో కివీస్ బ్యాటర్లు తడబడ్డారు.

కోహ్లీ @ 50

న్యూఢిల్లీ: బ్యాటింగ్ బ్లాస్టర్ విరాట్ కోహ్లీ విశ్వరూపం ప్రదర్శించాడు. తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో అతిపెద్ద, అద్భుతమైన మైలురాయిని చేరుకున్నాడు. వన్డేల్లో 50వ సెంచరీ నమోదు చేసి ప్రపంచ రికార్డును సృష్టించాడు. బుధవారంనాడు ముంబయిలో న్యూజిలాండ్‌తో జరిగిన వరల్డ్‌కప్ సెమీఫైనల్స్ మ్యాచ్‌లో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. ఇప్పటివరకు వన్డేల్లో 49 సెంచరీలతో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట వున్న వరల్డ్ రికార్డును కోహ్లీ బద్దలుగొట్టాడు. కివీస్ బౌలింగ్‌ను చీల్చిచెండాడిన కోహ్లీ కేవలం 106 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అద్వితీయమైన సెంచరీ పూర్తి చేశాడు. వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ నాకౌట్ మ్యాచ్‌లో కోహ్లీ 42వ ఓవర్‌లో తన రికార్డు సెంచరీని పూర్తి చేసి అభిమానులకు

- మిగతా 2 లో



చంద్రబాబు బెయిల్‌పై విచారణ
నేటికి వాయిదా

స్కిల్ కేసులో సీఐడీ మరో అఫిడవిట్

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 16వ తేదీ గురువారానికి వాయిదా పడింది.

2లో

విద్యా దీవెనకు
కొర్రీ ?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న విద్యా దీవెన (జేవీడీ) పథకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ఉమ్మడి బ్యాంకు ఖాతా నిబంధనలు విద్యార్థులు, వారి తల్లులకు ఇబ్బందిగా మారాయి. జేవీడీ పథకానికి కొర్రీలు పెట్టేందుకే ఈ నిబంధనలు విధిస్తున్నారని విమర్శిస్తున్నారు. విద్యార్థులను రాబోయే ఎన్నికలకు సమాయత్తం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 15వ తేదీ(బుధవారం)తో ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు గడువు ముగిసింది. ఆశించిన స్థాయిలో తల్లులు ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరవలేకపోయారు. దీంతో సమయం పొడిగించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తులు వచ్చాయి. ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తప్పనిసరి నిబంధనతో బ్యాంకుల ఎదుట తల్లులు బారులు తీరుతున్నారు.

విద్యార్థులు సైతం పరీక్షల ప్రిపరేషన్ సమయంలో కళాశాలలు విడచి తల్లులతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈనెల 28వ తేదీన జగనన్న విద్యాదీవెన పథకం కింద నాలుగో విడత నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమచేయనున్నారు.

- ఉమ్మడి ఖాతా నిబంధన
- తల్లులు, విద్యార్థుల వెతలు
- బ్యాంకుల ఎదుట నిరీక్షణ
- పాన్ కార్డు షరతుతో పాట్లు
- ప్రభుత్వ ఆదేశాలపై ఆగ్రహం
- గడువు పొడిగించాలని వినతులు

గతేడాది కంటే ఈ విడత భిన్నంగా తల్లి, విద్యార్థితో ఉన్న ఉమ్మడి బ్యాంకు ఖాతాలో సొమ్ము వేసేలా నిబంధనలను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. వారిద్దరి పేరుతో సంయుక్త ఖాతాలు తెరవాలని కళాశాలల ప్రిన్సిపాళ్లకు, యాజమాన్యానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీజేశారు. ఇంతవరకు తల్లుల ఖాతాలోనే జగనన్న విద్యాదీవెన డబ్బులు జమ చేయగా, ఈసారి అదనంగా తల్లి, విద్యార్థి ఉమ్మడి ఖాతా నిబంధన ప్రవేశపెట్టారు. ఇది కేవలం జేవీడీ

- మిగతా 2 లో

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

228 రోజులు... 50 ఎంఎంటీ సరుకు రవాణా

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఈ(2023-24) ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ కేవలం 228 రోజుల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు హ్యాండిల్ చేసేందుకు 251 రోజుల సమయం పట్టింది. విశాఖపట్నం పోర్టు అథారిటీలో నిబద్ధత గల సిబ్బంది, పీపీపీ ఆపరేటర్లు, వ్యాపార భాగస్వాముల సహకారంతో పోర్టు ఈ ఘనత సాధించగలిగింది. ఈ ఘనత సాధించడం పట్ల ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖర్, అతని సిబ్బందిని పోర్టు

- మిగతా 2 లో

పల్నాడు అభివృద్ధికి కట్టుబడ్డా

సీఎం వైఎస్ జగన్
వరికపూడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపన

విశాలాంధ్ర-మాచర్ల: పల్నాడు ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా మాచర్ల వద్ద వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రూ.340 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. చిత్తశుద్ధి పట్టుదల ఉంటే ఏ పనైనా సాధించవచ్చన్నారు. ఏ అనుమతులు తీసుకోకుండా వరికపూడిశెల ప్రాజెక్టును నిర్మిస్తానంటూ నాటి సీఎం చంద్రబాబు రైతులను నమ్మించి 14 ఏళ్ల కాలం గడిపారన్నారు. తాను పల్నాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. ఈ ప్రాజెక్టుతో మాచర్ల, వినుకొండ, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. స్వప్రయోజనాల కోసం పరితపించే చంద్రబాబు పాలనకు తాను భిన్నంగా ఉంటానన్నారు. నా లక్ష్యం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమేనన్నారు. కరోనాతో సంక్షోభ కాలంలో కూడా పేద ప్రజల కోసం సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానన్నారు. రాష్ట్ర ప్రజలే నా బలం అని

- మిగతా 2 లో

ప్రియాంక, కేజ్రీవాల్‌కు
ఈసీ షోకాజ్‌లు

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం (ఈసీ) తీసుకుంటున్న అనేక నిర్ణయాలు ప్రశ్నలకు తావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష నాయకులతో, అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతలతో వ్యవహరించే తీరులో తేడా ఉండటంతో ఈ సంస్థ స్వావలంభనపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు షోకాజ్ నోటీసులను ఈసీ మంగళవారం జారీచేసింది. గురువారంలోగా వారి నుంచి వివరణను కోరింది. ప్రధాని మోదీపై నిరాధార, తప్పుడు వ్యాఖ్యలు చేసినట్లు ప్రియాంక, కేజ్రీవాల్‌కు ఇచ్చిన నోటీసుల్లో ఈసీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నిజమే సార్.. ఇదే నా ఇల్లు
నాకు అన్ని అర్హతలూ వున్నాయి,
ఒక ఇల్లు ఇప్పించండి!

ప్రజా ఉద్యమాలతో మోదీని గద్దె దించుదాం

- ఎర్రజెండాతోనే ప్రజా అజెండా సాధ్యం
- 'ప్రజారక్షణ భేరి'లో సీతారాం ఏచూరి
- విజయవాడలో సీపీఎం భారీ ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజా ఉద్యమాలను బలపర్చడం ద్వారానే కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడం సాధ్యమని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. విజయవాడలోని అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన ప్రజారక్షణ భేరీ సభలో ఆయన ప్రసంగించారు. ప్రజారక్షణ భేరి సభకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సీతారాం ఏచూరి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 49 హింసాత్మక సంఘటనలు మహిళలపై ప్రతీరోజూ జరుగుతున్నాయన్నారు. గిరిజన భూములలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆయన మండిపడ్డారు. అమెరికా జూనియర్ భాగస్వామిగా భారత్‌ను మోదీ తయారు చేశారని విమర్శించారు. గవర్నర్‌లు శాసనసభల చట్టాలు తప్పు పట్టడం సరైనది కాదని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. ప్రజా ఉద్యమాలను బలపరచడం ద్వారా మోదీని గద్దె దింపాలని ఏచూరి పిలుపునిచ్చారు. ఇప్పుడున్న ఎమర్జెన్సీ నుంచీ బయటపడాలంటే మోదీని గద్దె దించడమే ఏకైక లక్ష్యమని, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ నుంచి ఆమెను ఓడించి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించారని గుర్తుచేశారు. భారత్‌లో ఎక్కువ నిరుద్యోగం

- మిగతా 2 లో

అక్రమ బ్లాస్టింగ్‌లు

- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- క్వారీ యజమానుల ఇష్టారాజ్యం

కవ్వగుంట గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న వీరభద్ర గ్రానైట్ క్వారీలో అక్రమ బ్లాస్టింగ్‌లు కొనసాగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు వణికిపోతున్నారు.

2లో



అమెరికా, చైనాపై కోవిడ్ పంజా

మళ్లీ పెరుగుతున్న కేసులు
ఆందోళనకరంగా కొత్త వేరియంట్లు

వాషింగ్టన్/బీజింగ్: అమెరికా, చైనా దేశాలను కోవిడ్ వణికిస్తోంది. కేసులు మరోమారు భారీగా పెరుగుతున్నాయి. కొత్త వేరియంట్ ఆందోళనకలిగిస్తోంది. మ్యుటేషన్ల కారణంగా కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. అక్టోబరు చివరి నుంచి ఇప్పటివరకు హెచ్‌వీ-1 వేరియంట్ కేసులు 25.2శాతంగా ఉన్నట్లు యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వెల్లడించింది. హెచ్‌వీ-1 వేరియంట్ ఒమిక్రాన్ సబ్ వేరియంట్‌లను పోలివున్నట్లు వెండర్ బిల్ట్ వర్సిటీ మెడికల్ సెంటర్ ప్రొఫెసర్ డాక్టర్ విలియం స్కాఫ్నర్ వెల్లడించారు. చలికాలంలో హెచ్‌వీ-1 మరింత వ్యాప్తి చెందుతుందని అధికారులు హెచ్చరించారు. జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గు, గొంతు నొప్పి, కండరాల నొప్పులు వంటివి ఈ వ్యాధి లక్షణాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈజీ-5 వేరియంట్ కూడా వేగంగా వ్యాప్తి చెందుతోందని, దీనిని వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్‌గా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గుర్తించిందని అధికారులు గుర్తుచేశారు. హెచ్‌వీ-1, ఈజీ-5తో పాటు ఫోర్నాక్స్ ఎఫ్ఎల్1.5.1, ఎక్స్‌బీబీ1.16 వేరియంట్లు కూడా అమెరికాలో వ్యాప్తి చెందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు చైనాలోనూ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా 209 కొత్త కేసులు, 24 మరణాలు అక్టోబరులో నమోదయ్యాయని చైనా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది. ఎక్స్‌బీబీ వేరియంట్ ఎక్కువగా వ్యాపిస్తోంది. శీతాకాలంలో కోవిడ్-19తో పాటు, మైకోప్లాస్మా న్యుమోనియా, ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరుగుతున్నాయని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ హెచ్చరించింది. సాధారణ ప్రజల రోగనిరోధక శక్తి తగ్గుతోందని చైనా వైద్యులు నివేదించారు. నివారణ, నియంత్రణ చర్యలను క్రమం తప్పకుండా పాటించాలన్నారు.

ఆరేళ్ల తర్వాత అమెరికాకు జిన్‌పింగ్

బైడెన్‌తో శాన్‌ఫ్రాన్సిస్కోలో ద్వైపాక్షిక సమావేశం
కీలకాంశాలపై చర్చలు

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా, చైనా మధ్య సైనిక, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రెండు దేశాల అధినేతలు ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార మండలి (అపెక్) శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యేందుకు శాన్‌ఫ్రాన్సిస్కో చేరుకున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ దాదాపు ఆరేళ్ల తర్వాత అమెరికా గడ్డపై కాలు మోపారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఆహ్వానం మేరకు ఆయన వచ్చారు. ఆర్థిక, రాజకీయ, సైనికపరమైన విభేదాలు... ఘర్షణల క్రమంలో రెండు దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం పరిస్థితి నెలకొన్న సమయంలో ఇద్దరు అధినేతలు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. తైవాన్, దక్షిణ చైనా సముద్రం, ఇజ్రాయిల్-హమాస్ పోరు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఉత్తర కొరియా, మానవహక్కుల ఉల్లంఘనలు తదితర అనేక అంశాలపై ఇద్దరు అధినేతలు చర్చించినట్లు సమాచారం. 21 దేశాల ప్రతినిధులు పాల్గొనే అపెక్ సదస్సు నేపథ్యంలోనే జో బైడెన్, జిన్ పింగ్ మధ్య బుధవారం ప్రత్యేక ద్వైపాక్షిక భేటీ జరిగింది. ఈ భేటీ విజయవంతం అయితే ప్రపంచ స్టాక్ మార్కెట్లు సానుకూలంగా స్పందిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. అలాగే ఈ భేటీ ద్వారా రెండు దేశాల మధ్య సంబంధాలు చక్కబడతాయన్న అంచనాలు ఉన్నాయి. వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవడం, సైనిక స్థాయి చర్చలను పున: ప్రారంభించడం, ద్వైపాక్షిక సహాయం అవసరమయ్యే అంశాల నిర్ధారణ తదితరాలపై ఇద్దరు నేతలు చర్చించినట్లు సమాచారం.బైడెన్, జిన్‌పింగ్ ముఖాముఖీ భేటీ అవ్వడం ఈ ఏడాదిలో ఇదే తొలిసారి. గతేడాది ఇండోనేషియాలోని బాలిలో జరిగిన జీ20 సదస్సులో వీరిద్దరూ తొలిసారి ముఖాముఖీగా సమావేశమయ్యారు. కాగా, అమెరికా వ్యాపారవేత్తలతో జిన్‌పింగ్ ప్రత్యేక విందులో పాల్గొన్నట్లు, విందు కోసం కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చినట్లు వార్తలు వచ్చాయి.

విశాలాంధ్ర ప్రపంచం

అక్రమ బ్లాస్టింగ్‌లు

విశాలాంధ్ర-రావికమతం(అనకాపల్లి జిల్లా): కవ్వగుంట గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న వీరభద్ర గ్రానైట్ క్వారీలో అక్రమ బ్లాస్టింగ్‌లు కొనసాగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు వణికిపోతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ దాసరి సూర్యకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ క్వారీ యజమానులకు ఫోన్ చేశారు. అక్రమ బ్లాస్టింగ్, క్వారీ నిర్వహణ వలన గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బ్లాస్టింగులు నిలిపివేయాలని హెచ్చరించారు. అయినా క్వారీ యజమానులు పట్టించుకోలేదు. దీనిపై సర్పంచ్ సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కవ్వగుంట గ్రామంలోని ఉరలోవ కొండపై గల వీరభద్ర గ్రానైట్ క్వారీ గ్రామానికి అతిసమీపంలో ఉందని, రాత్రి పగలు తేడా లేకుండా క్వారీ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగులు చేయడంతో గ్రామంలో ఇళ్లు బీటలు వారుతున్నాయని చెప్పారు. సన్‌సైడ్‌పై గల ముంతలు, చెంబులు వంటి సామగ్రి కింద పడటం, ఇంట్లో సామాన్లు ఊగిపోవడం జరుగుతోందని వివరించారు. రావికమతం నుంచి ఘాట్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోనే గ్రానైట్ క్వారీ యజమానులు బ్లాస్టింగులకు పాల్పడటంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గ్రామ రైతులు సీమసిరి రాజు, సీమసిరి దేములు, వర్నికాన రాజు, వర్నికాన రవణమ్మ, దేవర దేవరాజులమ్మ, దాసరి పెద్దిరాజులు, దాసరి నాగరాజు తదితరుల పచ్చని పంట పొలాలు సైతం రాయి రప్పలు, దుమ్ము, ధూళితో సర్వనాశనమవుతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న గ్రానైట్ క్వారీలను నిలుపుదల చేయాలని, అక్రమ బ్లాస్టింగులు ఆపాలని, క్వారీ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌తో పాటు రైతులు, గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మైనింగ్, పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు తక్షణమే స్పందించాలని కోరారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. గ్రామం మధ్యలో ఆర్ అండ్ బి రోడ్డు ఉండడంతో లారీలు అధిక బరువుతో వెళ్లడం వల్ల తారు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మట్టి రోడ్డు కంటే దారుణంగా మారడమే కాకుండా చెరువును తలపిస్తున్నది. గ్రానైట్ క్వారీల వలన అటు రైతులకు, ఇటు గ్రామ ప్రజలకు, పశువులకు ఇబ్బంది కలుగుతోంది. ప్రభుత్వ శాఖల అధికారులు ముడుపులు తీసుకొని క్వారీ యజమానులపై చర్యలకు ముందుకు రావడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

ఈసీ షోకాజ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. బీజేపీ ఫిర్యాదుల మేరకు ఇద్దరు ప్రతిపక్ష పార్టీల నేతలపై చర్యలకు ఉపకరించింది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగించడమే కాకుండా తమ పారిశ్రామిక మిత్రులకు భారత్ హెవీ ఎలక్ట్రానికల్స్ లిమిటెడ్ (భెల్)ను దారాదత్తం చేస్తున్నట్లు మోదీపై ప్రియాంక ఆరోపణలు చేశారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో నరేంద్రమోదీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలతో కేజ్రీవాల్‌కు ఈసీ నోటీసులు జారీ అయ్యాయి. పారిశ్రామికవేత్త గౌతం అదానీ కోసం మోదీ పనిచేస్తున్నారన్న ఆప్ పోస్టుపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు చేసింది. జాతీయ పార్టీగా బహిరంగ ప్రకటన చేయడానికి ముందు వాస్తవాలు ధ్రువీకరించుకోవాలని ఆప్‌కు జారీచేసిన నోటీసులో ఈసీ పేర్కొంది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు కూడా వెల్లడించింది. అయితే చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలప్పుడు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, అసోం ముఖ్యమంత్రి హిమంతా బిశ్వశర్మ మీద ఈసీకి కాంగ్రెస్ అక్టోబరులో ఫిర్యాదు చేసింది. ఆ ఇద్దరు బీజేపీ నేతలకు ఈసీ షోకాజ్‌లు జారీ చేసినట్లు సమాచారం లేదు.

కేజ్రీవాల్‌ను అవమానించే పోస్టులపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం: రాఘవ్ చద్దా

ప్రస్తుత ఎన్నికలను ప్రభావితం చేసే ఉద్దేశంతో అరవింద్ కేజ్రీవాల్‌ను అప్రతిష్ఠపాల్చేయాలని బీజేపీ యత్నిస్తోందని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో అవమానకర పోస్టులు పెడుతోందని దుయ్యబట్టారు. ఢిల్లీ సీఎంను అపకీర్తికి గురిచేయాలని చూస్తోందని, దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని బుధవారం విలేకరులతో మాట్లాడిన చద్దా తెలిపారు. 'నెహ్రూ నుంచి కేజ్రీవాల్ వరకు బీజేపీ ఎవరినీ వదల్లేదు. అందరినీ కించపరిచింది. సొంత ప్రతిష్ఠ మెరుగుపర్చుకోవడం తెలియక ఇతరుల్ని అవమానిస్తుంటుంది. బీజేపీ తీరుతో దేశంలో స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికల విధానం బలహీనమవుతోంది. బీజేపీపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం. ఈసీ తగు చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అని చద్దా అన్నారు.

మృత్యు లోయ

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు.. సహాయక చర్యలు చేపట్టారు.

అధికారుల సమాచారం ప్రకారం.. జేకేఓ2సీఎన్-6555 రిజిస్ట్రేషన్ నంబర్ గల బస్సులో 60మంది వరకు ప్రయాణిస్తున్నారు. వారంతా క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటామనుకున్నారు కానీ అంతలోనే విధి వారి జీవితాలను చిదిమేసింది. బాటోటె-కిష్త్వా ర్ జాతీయ రహదారిపై తుంగల్-అసార్ సమీపానికి బస్సు రాగానే... బస్సు అదుపుతప్పి 300 అడుగులు ఉన్న లోయలో కి పడిపోయింది. ఒక్కసారిగా బస్సులో ఉన్న ప్రయాణికులకు ఏంజరిగిందో అర్థం కాలేదు. భయంతో కేకలు వేశారు. అంతలోనే బస్సులో ఉన్న 38 మంది ప్రాణాలు అనంత లోకాల్లో కలిసిపోయాయి. మరికొందరు రక్తపు మడుగులో పడి ఉన్నారు. ఎవరైనా వచ్చి తమను కాపాడితే బాగుండని అనుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది.. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. రక్తపు మడుగులో ఉన్న క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పదుల సంఖ్యలో మృతదేహాలను వెలికితీశారు. అత్యంత ఎత్తు నుంచి లోయలో పడిపోవడం వల్ల బస్సు నుజ్జునుజ్జయింది. గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి చాలా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుల్ని కిష్త్వార్, దోడా సీఎంసీ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జమ్ము డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్ వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

ప్రధాని దిగ్భ్రాంతి

కశ్మీర్‌లో బస్సు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జితేంద్ర సింగ్, జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రధాని పరిహారం ప్రకటించారు. ఈ పరిహారాన్ని ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి అందించనున్నారు. మరోవైపు ప్రమాద ఘటనపై కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని అధికారుల్ని ఆదేశించినట్లు చెప్పారు. అవసరమైతే హెలికాప్టర్ సేవల్ని వినియోగించాలని సూచించారు.

విద్యా దీవెనకు కొర్రీ ?

(మొదటిపేజీ తరువాయి)

పథకం కుదింపు కోసమేనని తల్లులు మండిపడుతున్నారు.

పాన్ కార్డులు ఉంటేనే ఖాతాలు

ప్రభుత్వం తాజాగా తెచ్చిన ఉమ్మడి ఖాతా విధానంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉమ్మడి ఖాతాలు తెరిచేందుకుగాను విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోంది. జాతీయ బ్యాంకులలో ఖాతాలు తెరవాలి. ఇందుకు దాదాపు వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వరకు బ్యాంకులకు చెల్లించాల్సి వస్తోంది. దాంతోపాటు విద్యార్థుల పేరిట పాన్‌కార్డును తప్పనిసరిగా బ్యాంకు యాజమాన్యం అడుగుతోంది. పాన్ కార్డులు, ఆధార్‌ను బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేస్తారు. తల్లిదండ్రులకు పాన్‌కార్డులు ఉన్నప్పటికీ విద్యార్థులకు లేనందున ఉమ్మడి ఖాతాలు ఆలస్యమవుతోంది. పాన్ కార్డులు లేని విద్యార్థుల ఉమ్మడి ఖాతాలను బ్యాంకు అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో విద్యార్థులంతా పాన్ కార్డుల కోసం దరఖాస్తులు ప్రారంభించారు. దరఖాస్తు చేసిన వారం తర్వాత పాన్‌కార్డులు వచ్చే అవకాశముంది. 2022-23 విద్యా సంవత్సరం పూర్తిచేసిన(ఫైనల్) విద్యార్థులకు, ఎస్సీ విద్యార్థులకు ఉమ్మడి ఖాతాను మినహాయించారు. ఉమ్మడి ఖాతాలో ఎలాంటి డెబిట్ కార్డ్ లేదా ఇంటర్నెట్ బ్యాంక్ సౌకర్యం ఉండకూడదు. ఉమ్మడి ఖాతా తెరిచిన ప్రక్రియ పూర్తయ్యాక... దానిని బ్యాంకులో తల్లి, విద్యార్థి ఆధార్‌తో కేవైసీ పూర్తి చేయించి సంబంధిత వివరాలను సమీప గ్రామ/వార్డు సచివాలయంలో సమర్పించాలి. వార్డు/గ్రామ సచివాలయ సంక్షేమ కార్యదర్శి సమక్షంలో బ్యాంకు వివరాలు పొందుపరచాలి. వాటిన్నింటినీ జ్ఞానభూమి ఖాతాల్లో విజయవంతంగా నిర్ధారించేలా సచివాలయ అధికారులు చర్యలు చేపట్టాలి. ఈ తరహా ఉమ్మడి ఖాతాల వివరాలను ఎంతమంది జమ చేశారు?, వారికి అసలు దీనిపై పూర్తి వివరాలు తెలిశాయా? లేదా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది.

ఉమ్మడి ఖాతాలతో ఇబ్బందులు

జేవీడీ పథకానికి ఉమ్మడి ఖాతా నిబంధనలు పెట్టడంతో లబ్ధిదారులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు 20 లక్ష మందికిపైగా ఉపాధి కోసం వలసల వెళ్లారు. వారిలో జేవీడీ పథకానికి అర్హులైన తల్లులు ఉన్నారు. వారి పిల్లలు స్థానికంగానే ఉండి ఇంజినీరింగ్, డిగ్రీ తదితర కోర్సులు అభ్యసిస్తున్నారు. ఈ సమయంలో తల్లి, విద్యార్థి పేరిట ఉమ్మడి ఖాతా తెరవాలనే నిబంధనతో వారంతా ఆయా నగరాలు, రాష్ట్రాల నుంచి పనులు వదిలి వెనక్కి రావాల్సి ఉంది. ఈ సమాచారం ఆలస్యంగా తెలియడంతో ఆ తల్లులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ఖాతాల కోసం వారంతా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ పనులు మానుకొని, ఆర్థికంగా నష్టపోయి తిరిగి గ్రామాలకు తరలివస్తున్నారు. తల్లి, విద్యార్థి ఉమ్మడి ఖాతాలు తెరవకుంటే ఈనెల 28న విడుదల చేసే జగనన్న విద్యా దీవెన నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉంది. గతంలో అమ్మఒడి పథకం డబ్బులు ఆయా తల్లులు ఖాతాల్లో పడాలంటే బ్యాంకు ఖాతాతో ఆధార్ లింకును (కేవైసీ)తప్పనిసరి చేశారు. చాలామంది తల్లుల ఖాతాల్లో డబ్బులు పడలేదు. కేవైసీ సరిగ్గా లేదనే సాకుతో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది దాటవేశారు. ఆ తర్వాత బ్యాంకుల చుట్టూ, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇప్పుడు జగనన్న విద్యా దీవెన పథకానికి సైతం ఉమ్మడి ఖాతాలు తెరవడంతో కేవైసీ సమస్యలు ఎదురవుతాయని తల్లులు ఆందోళన చెందుతున్నారు. ఇక చేసేదేమీ లేక అన్ని జిల్లాల్లోను బ్యాంకుల దగ్గర తల్లులు, తండ్రులు పడిగాపులు పడుతున్నారు. సమయం మించిపోవడంతో ఇంకా గడువు పెంచాలని కోరుతున్నారు. కళాశాలల్లో పరీక్షల సమయం ఆసన్నమై, విద్యార్థులంతా పరీక్షల సన్నద్ధతలో ఉండగా ఉమ్మడి ఖాతా అంశం తెరపైకి రావడం బాధాకరం. ఈ సమస్యలను ప్రభుత్వం గుర్తించి ఉమ్మడి ఖాతాల కోసం గడువు పెంచాలని తల్లులు కోరుతున్నారు.

పల్నాడు అభివృద్ధికి కట్టుబడ్డా

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. తన హయాంలో ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వాలలో చేయని అభివృద్ధి, సంక్షేమం మన ప్రభుత్వంలో జరిగిందన్నారు. పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రతి ఇంటికి జరిగిన లబ్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని... ప్రజలనే నమ్ముకున్నానని, చంద్రబాబు మాదిరి తనకు మాయ మాటలు చెప్పటం రాదని, చెప్పింది చేసి చూపించడమే తన తండ్రి నుండి నేర్చుకున్నానన్నారు. అధికార పార్టీపై అసత్య ప్రచారాలు చేసే ప్రతిపక్ష నాయకుడికి తన 55 నెలల పరిపాలనలో సంక్షేమ పథకాలు, వాలంటీర్ వ్యవస్థ, సచివాలయం, నాడు నేడు పనులు, జగనన్న కాలనీలే సమాధానం చెప్తాయన్నారు. తనకు వెన్నుపోటు రాజకీయాలు తెలియవని సీఎం జగన్ అన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని చంద్రబాబు కొత్త మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చి మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తాడని... ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం పిన్నెల్లి సోదరులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఉదయం 10 గంటలకు సాగర్ రోడ్డులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సీఎం జగన్‌కు అక్కడి నుంచి సభా వేదిక వరకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. బహిరంగ సభకు సుమారు 50 వేలమంది తరలి వచ్చినట్టు ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామి రెడ్డి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి నాగేశ్వరరావు, జల వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నారాయణరెడ్డి, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, పల్నాడు జిల్లా ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలతో మోదీని గద్దె దించుదాం

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. హెచ్‌డీఐ, జీడీపీలలో జి 20 దేశాలలో భారత్ అందరికంటే కింది వరుసలో ఉందని ఏచూరి వివరించారు. ప్రజల అజెండాను తీసుకొచ్చేది ఎర్రజెండాలేనని ఆయన చెప్పారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం పాలకులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వారే ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. అమృత్‌కాల్ వస్తుందని మాటలు చెపుతున్నారని, అమృతం తప్పులు చేసే వారి చేతిలో ఉందన్నారు. ప్రజలకు అమృతం అందించాలంటే ప్రజాఉద్యమం కావాలన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బుల్‌డోజర్, లవ్‌జీహాద్, గో రక్షక్ పద్ధతులు అవలంబిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీమాకోరేగావ్ కేసులో చార్జ్‌షీట్ లేకుండా చాలామందిని జైలులో ఉంచారని చెప్పారు. వాస్తవాలు చూపిస్తున్న మీడియా యాజమాన్యంపై కేసులు పెడుతున్నారన్నారు. ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయినా డబ్బు, ఈడీ, సీబీఐలతో భయపెట్టి తన ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాదాపు 16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందని, అంత డబ్బు ప్రభుత్వరంగంలో పెట్టి ఉంటే ఉద్యోగాలు వచ్చేవని, సంపద పెరిగేదని చెప్పారు. ఆశ్రిత పెట్టుబడి విధానంతో సంపదను లూటీ చేస్తున్నారన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగి విదేశీ విధానాన్ని అనుసరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సమాఖ్య వ్యవస్థను మోదీ నాశనం చేశారని ధ్వజమెత్తారు. గవర్నర్ వ్యవస్థ దిగజారి వ్యవహరిస్తున్నదని విమర్శించారు. లౌకికతత్వాన్ని, ఆర్థిక సమృద్ధిని, గవర్నర్ వ్యవస్థను, సామాజిక న్యాయాన్ని బీజేపీ నాశనం చేస్తోందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అరెస్టు వెనుక మోదీ ఉన్నారని ఏచూరి ఆరోపించారు. భారతదేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు టీడీపీ, జనసేన ఎవరి వైపు ఉండాలో నిర్ణయించుకోవాలని హితవు పలికారు. కేంద్రంలో బీజేపీని గద్దె దించటానికి ఇండియా కూటమి బలపడాలన్నారు. ముందుగా సీపీఎం రూపొందించిన 'ప్రజా ప్రణాళిక' పుస్తకాన్ని సీతారాం ఏచూరి ఆవిష్కరించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 'వై నీడ్స్ జగన్' అంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం వ్యాపార ప్రకటనలా ఉందని, రాజకీయ నినాదంగా లేదన్నారు. సీఎం జగన్ కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టులతో పాటు ప్రజా సంపదను అదానీకి దోచిపెడుతున్నారన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసి విభజన హామీలకు ఎసరు పెట్టిన బీజేపీ ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనే ధైర్యం ముఖ్యమంత్రి జగన్‌కు లేదన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బీవీ రాఘవులు, పుణ్యవతి, పి.మధు, రాష్ట్ర కమిటీ నాయకులు ఎంఏ గఫూర్ తదితరులు ప్రసంగించారు. పార్టీ రాష్ట్ర నాయకులు సీహెచ్.బాబూరావు, డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముందుగా బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుంచి సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం వరకు భారీ ప్రదర్శన జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సీపీఎం శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించవద్దని పోరాటం చేస్తున్న విశాఖ ఉక్కు ఒప్పంద కార్మికులు విశాఖ నుంచి బైక్‌లపై ర్యాలీగా వచ్చారు. పోలవరం ముంపు ప్రాంతాల నిర్వాసితులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ర్యాలీ ముందు, సభావేదిక వద్ద ప్రజానాట్య మండలి అధ్వర్యంలో చేసిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సభలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన సీతారాం ఏచూరికి సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ప్రజాపోరాటాలకు సీపీఐ తరుపున మద్దతు ప్రకటించారు.

చంద్రబాబు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 16వ తేదీ గురువారానికి వాయిదా పడింది. ఈ కేసులో బుధవారం హైకోర్టులో సీఐడీ, చంద్రబాబు తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై న్యాయవాదులు వివరిస్తూ కుడి కంటికి శస్త్ర చికిత్స జరిగిందని, ఆయన కోలుకోవడానికి తప్పనిసరిగా మందులు వాడాలని, కంటి పరీక్ష కోసం ఐదు వారాలపాటు షెడ్యూలు ఇచ్చారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. కంటి ఆపరేషన్, ఆరోగ్య పరిస్థితి వివరాలను హైకోర్టుకు నివేదించారు. మరో ఐదు వారాలపాటు ఇన్ ట్రా ఆక్యులర్ ప్రెజర్ చెకప్‌ను చంద్రబాబు చేసుకోవాల్సి ఉందని, చంద్రబాబు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని, గుండె పరిమాణం పెరిగిందని, దానికి రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో సమస్యలున్నాయని వివరించారు. మధుమేహం అదుపులో ఉందని, జాగ్రత్తలు పాటించాలని, తగినంత విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించిన నివేదికను కోర్టుకు ఇచ్చారు. అటు స్కిల్ కుంభకోణం కేసులో అదనపు అఫిడవిట్‌ను అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ కేసులో మరిన్ని వాదనలు వినేందుకుగాను గురువారం నాటికి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఇప్పటికే చంద్రబాబు నాలుగు వారాలపాటు మధ్యంతర బెయిలు పొందారు. మరోవైపు ఇదే కేసులో సుప్రీంలో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పు పెండింగ్‌లో ఉంది.

కొల్లు రవీంద్ర పిటిషన్ వాయిదా

మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి, టీడీపీ నేత కొల్లు రవీంద్ర హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 16వ తేదీ గురువారానికి వాయిదా పడింది. టీడీపీ ప్రభుత్వంలో మద్యం కంపెనీలకు లబ్ధి చేకూర్చారన్న అభియోగాలతో కొల్లు రవీంద్రపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. తనపై అకారణంగా కేసు నమోదు చేశారని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కొల్లు రవీంద్ర హైకోర్టును ఆశ్రయించగా, దానిపై విచారణను వాయిదా వేసింది.

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

చైర్‌పర్సన్ డా.ఎం.అంగముత్తు ప్రత్యేకంగా అభినందించారు. అంకిత భావంతో పని చేసి మంత్రిత్వ శాఖ నిర్దేశించిన రికార్డును చేరుకోవాలని సూచించారు. పోర్టు చరిత్రలో ఈ రికార్డు ఒక మైలు రాయి అని, ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన అందరికీ యాజమాన్యం శుభాభినందనలు తెపడంతో పాటు భవిష్యత్తులో ఇదే విధమైన సహకారం అందించి పోర్టు అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వివరాలను పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.

కోహ్లి @ 50

(మొదటిపేజీ తరువాయి)

అభివాదం చేశాడు. సచిన్ స్వంత మైదానంలోనే అతని రికార్డును కోహ్లి అధిగమించడం విశేషం. మంచి ఫామ్‌లో వున్న కోహ్లికి ఈ వరల్డ్‌కప్‌లో ఇది మూడవ సెంచరీ. ఇప్పటివరకు నాలుగు వరల్డ్‌కప్‌లు ఆడిన కోహ్లి నాకౌట్ మ్యాచ్ (సెమీస్ లేదా ఫైనల్స్)లో సెంచరీ చేయడం ఇదే తొలిసారి. కోహ్లి తన రికార్డును నెలకొల్పే క్రమంలో సచిన్ పేరిట వరల్డ్‌కప్ సింగిల్ ఎడిషన్‌లో వున్న 673 పరుగుల రికార్డును కూడా అధిగమించడం మరో విశేషం. అంతేగాకుండా, వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్లలో కోహ్లి మూడవ నెంబర్‌కు ఎగబ్రాకాడు. రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా) పేరిట వున్న 13,704 పరుగుల మైలురాయిని అధిగమించిన కోహ్లి సచిన్ టెండూల్కర్ (18,426), కుమార సంగక్కర (శ్రీలంక-14,234)ల తర్వాత మూడో స్థానాన్ని ఆక్రమించాడు. 2023 వరల్డ్‌కప్ ఎడిషన్‌లో కోహ్లి 700 పరుగులకు చేరువలో వున్నాడు. ఈ ఎడిషన్‌లో అతనే అత్యధిక రన్ స్కోరర్. ఇప్పటివకే అతను దక్షిణాఫ్రికా (101), బంగ్లాదేశ్ (103 నాటౌట్)లపై సెంచరీలు నమోదు చేశాడు. సెమీస్‌లో కివీస్‌పై కోహ్లి 117 పరుగులు సాధించాడు.

కేశవరెడ్డి బాధితులకు న్యాయం చేయాలి

లేకపోతే ప్రత్యక్ష పోరుకు సిద్ధం: శివారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఉచిత విద్య హామీనిచ్చి విద్యార్థుల నుంచి డిపాజిట్లు కట్టించుకున్నారని కేశవరెడ్డి విద్యాసంస్థలపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శివారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. డిపాజిట్లను విద్యార్థులకు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అధికారంలోకి రాగానే కేశవరెడ్డి బాధితులకు న్యాయం చేస్తానన్న హామీని మరిచి కేశవరెడ్డికి వత్తాసు పలుకుతున్నారని సీఎం జగన్‌ను విమర్శించారు. కేశవరెడ్డి విద్యా సంస్థలకు పచ్చజెండా ఊపి, బాధితులకు అన్యాయం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగే వరకు ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని శివారెడ్డి ప్రకటించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి అధ్వర్యంలో స్థానిక దాసరి భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శివారెడ్డితో పాటు బాధితుడు మందగళ్ల సాయికుమార్ మాట్లాడారు.

రాష్ట్రంలోని కేశవరెడ్డి విద్యాసంస్థల్లో రూ.లక్ష నుంచి రూ.3లక్షలకుపైగా డిపాజిట్లు కట్టించుకున్నట్లు తెలిపారు. కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి... విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేశారని ఆరోపించారు. మొత్తం డబ్బు ఎగ్గొట్టాలని చూస్తున్నారని, అందుకే ఆస్తులన్నీ కోర్టుకు అప్పగించినట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్షులు అయ్యప్ప, ఉపాధ్యక్షులు సుధీర్, సాయికుమార్, జగదీశ్, రంజిత్ పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి

- పంట నష్టం కలిగిన జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-కశింకోట/ అనకాపల్లి/నర్సీపట్నం: రాష్ట్రంలో పంట నష్టం కలిగిన జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించాలని, రైతులను తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలో ఎండిన వరి పొలాలను అలాగే, నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామ ప్రాంతాలలో వర్షాలు లేక ఎండిపోతున్న పంట పొలాలు క్షేత్ర పరిశీలన చేశారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో కరువు విలయ తాండవం చేస్తుంటే మంత్రి అమర్నాథ్ మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. ఎండిన వరి పొలాలను మంత్రి పరిశీలించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసేలా ఉన్న కృష్ణా జలాల పున: పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా, రాష్ట్ర కరువు పరిస్థితులను పట్టించుకో కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఈ నెల 20 21 తేదీలలో 30 గంటల దీక్షలకు సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో 30 గంటల దీక్షకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు దారుణంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రంలో 440 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే కేవలం 103 మండలాలనే ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం కరువుపై కేంద్రానికి నివేదిక పంపించలేదని, రాష్ట్రంలో పర్యటించి కరువు అంచనా వేసేందుకు కేంద్ర బృందాలను ఆహ్వానించలేదని మండిపడ్డారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువుపై రాష్ట్ర మంత్రులు, వైసీపీ నాయకులు నోరు ఎత్తకపోవడం దారుణమని తెలిపారు. కరువు బారినపడిన రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో చేపడుతున్న 30 గంటల దీక్షలకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ఎస్.సన్యాసిరావు, జిల్లా నాయకులు దేముడు బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు అప్పలరాజు, శంకరరావు, సీపీఐ నాయకులు నాయుడు, కనకరాజు, జి.దేవుడు బాబు, ఫణీంద్ర కుమార్, బాల్జీ, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టే రైతన్నను కాపాడలేని దౌర్భాగ్యమా...

నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామ ప్రాంతాలలో వర్షాలు లేక ఎండిపోతున్న పంట పొలాలను జేవీ సత్య నారాయణమూర్తి క్షేత్ర పరిశీలన చేశారు. అన్నం పెట్టే రైతన్నను కాపాడలేని దౌర్భాగ్యం ఉందంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఘనత అని ఘాటుగా విమర్శిం చారు. రైతుకు తీవ్ర నష్టం జరుగుతుంటే వ్యవసాయాధి కారులుగానీ, ప్రభుత్వ అధికారులు గానీ పంట నష్టాన్ని అంచనా వేయడం లేదని, స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రచారం కోసం గ్రామాల్లో తిరుగుతూ ఆర్భాటం చేసే సమయాన్ని రైతుల కష్టాన్ని పట్టించుకోవడానికి కేటాయిం చడం లేదని అన్నారు. పంట నష్టం కలిగిన కరువు జిల్లాలుగా ప్రకటించాలని, పంట నష్టం కలిగిన ఎకరానికి రూ.30 నుంచి 50 వేల వరకు నష్టపరిహారం ఇవ్వాలని, వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆదుకోని పక్షంలో రానున్న ఎన్నికల్లో పాలకులకు రైతాంగం, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, నర్సీపట్నం టౌన్, రూరల్ మండల కార్యదర్శిలు జి.గురు బాబు, నల్లబెల్లి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల పునః పంపిణీ, కరువుపై

సీపీఐ 30 గంటల దీక్షను జయప్రదం చేయండి

- పంటలు ఎండిపోతున్నా సీఎం జగన్ నిర్లక్ష్యం
- పట్టించుకోని మంత్రులు, ప్రజాప్రతినిధులు
- గుజ్జుల ఈశ్వరయ్య, ఆర్.రవీంద్రనాథ్

విశాలాంధ్ర-కనిగిరి: రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న కృష్ణా జలాల పునః పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా, రాష్ట్రంలో కరువు పరిస్థితులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని ఖండిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం కనిగిరిలోని దర్శి చెంచయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 18 జిల్లాల్లో 440 మండలాల్లో కరువు కారణంగా పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల్లో భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీరు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కరువుపై మాట్లాడేందుకు ఇష్టపడకపోవడం దారుణం అన్నారు. కర్నాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం సెప్టెంబరు 26న కరువు తాలూకాలను ప్రకటించడమే కాకుండా కేంద్ర కరువు బృందాలను పిలిపించి నివేదిక సమర్పించిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందని, మంత్రులు, ప్రజాప్రతి నిధులు కరువు ప్రాంతాల్లో పర్యటించలేదని విమర్శించారు. రాష్ట్రంలోని రైతులకు, సాగునీటి రంగానికి కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు చేసిన ద్రోహం అంతాఇంతా కాదన్నారు. నీరు లేక కేసీ కెనాల్, శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జునసాగర్ వెలవెలబోతున్నాయ న్నారు. ప్రభుత్వం కరువు సహాయ చర్యలు చేపట్టే వరకు రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందటానికి మోదీ ప్రభుత్వం కృష్ణా జలాల వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చిందని, దీనిద్వారా ఏపీకి అన్యాయం చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎండిన పంటకు నష్టపరిహారం ఇవ్వాలని, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని, గ్రామాల్లో 200 రోజులు ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ 30 గంటల నిరసన దీక్షలో రైతులు, ప్రజా సంఘాలు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు విరివిరిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సీపీఐ 30 గంటల దీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

27, 28న మహాధర్నా

ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు తలపెట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆర్.రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో, స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందన్నారు. కార్మిక హక్కులు మంట కలిసాయని, 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా చేసిందన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయడం లేదని, కాంట్రాక్టు కార్మికులకు క్రమబద్ధీకరణ, అవుట్‌సోర్సింగ్ కార్మికులను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గౌరవ వేతనంపై పేరుతో ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని మండిపడ్డారు. మహాధర్నాలో అన్ని రాజకీయ పార్టీలను, రైతు సంఘాలను కలుపుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులను ఆదుకోకపోతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.రవీంద్రబాబు, ఆర్.వెంకట్రావు, ఆర్.రామకృష్ణ, మండల కార్యదర్శి జి.పి.రామారావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ గులాం హుస్సేన్, ఏఐటీయూసీ కనిగిరి నియోజకవర్గ అధ్యక్షులు గుజ్జుల బాలిరెడ్డి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, రఘునాథరెడ్డి, సూరిబాబు, మీరావలి, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జానపద కళలను బతికించండి

చిన్నం పెంచలయ్య డిమాండ్

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: గ్రామీణ జానపద కళారూపాలను బతికించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ముఖ్యుల సమావేశం బుధవారం సీపీఐ కార్యాలయంలో కృష్ణ అధ్యక్షతన జరిగింది. పెంచలయ్య మాట్లాడుతూ కళాకారుల సంక్షేమాన్ని, గ్రామీణ జానపద కళలను జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. సాంస్కృతిక రంగాన్ని, కళాకారులకు సంక్షేమ కార్యక్రమాలను పట్టించుకోలేదని విమర్శించారు. సాంస్కృతిక శాఖకు రూపాయి కూడా కేటాయించకుండా కళాకారులను మభ్యపెడుతుందని, గుర్తింపు కార్డులు ముద్రించడానికి కూడా నిధులు లేకపోవడం సిగ్గు చేటన్నారు. పాఠశాల స్థాయి నుంచే బాలలకు కళలపై ఆసక్తి పెంచాలన్నారు. ఈనెల 17,18,19 తేదీలలో నంద్యాలలో జరిగే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదానికి పిలుపునిచ్చారు. ఆట పాటలతో సందడి చేయాలని ప్రజానాట్యమండలి కళాకారులను పెంచలయ్య కోరారు. అలాగే, పింఛన్ పెంపు కోసం, కరువు నివారణ చర్యల కోసం విజయవాడలో 20, 21 తేదీల్లో సీపీఐ చేపట్టే 30 గంటల నిరశనలో పాల్గొనాలని కళాకారులకు పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి కార్యక్రమాలకు పార్టీపరంగా, వ్యక్తిగతంగా అన్ని విధాలా సహకారమిస్తానని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రసూల్ భరోసానిచ్చారు. కర్నూలు జిల్లాలో ప్రజానాట్యమండలి కార్యకలాపాల నివేదికను ప్రజానాట్యమండలి కర్నూలు జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ప్రవేశపెట్టారు. మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభల కోసం కోలాటం బృందాలను, మహిళా చైతన్య గీతాలకు నృత్య బృందాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా, నగర నేతలు శివయ్య, శివ, రాంబాబు, కళాకారులు హుస్సేన్, చిరంజీవి, మధు పాల్గొన్నారు.

నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర- కడప: నకిలీ ఉల్లి విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే ఆందోళన తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారున. బుధవారం వైఎస్ఆర్ జిల్లా వీరపునాయునిపల్లి మండలం, పాయసంపల్లెలో ఉల్లి పంటను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ... వీరపునాయునిపల్లి మండలం పాయసంపల్లె, కీర్తి పల్లె, ఇందుకూరు గ్రామాల్లో దాదాపు 113 ఎకరాల్లో రైతులు ఉల్లి సాగు చేశారని... విత్తనం వేసి 20 రోజులు దాటినా ఎలాంటి ఎదుగుదల లేకుండా అక్కడక్కడ వచ్చిన మొలకలు చనిపోతున్నా యన్నారు. ఈ విషయాన్ని సంబంధిత పంచగంగ కంపెనీ విక్రయదారుల దృష్టికి, పులివెందుల, అనంతపురం డీలర్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై రైతులు రైతుభరోసా కేంద్రం వద్ద ఆందోళన చేయడంతో వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి, వివరాలను నమోదు చేశారన్నారు. దీనిపై శాస్త్రవేత్తలను పిలిపించి సమగ్ర విచారణ జరిపిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ...ఆచరణలో తీవ్రమైన అలసత్వం జరుగుతోందని చెప్పారు. గత సంవత్సరం ఉల్లి ధరలు పతనం కావడంతో కూలీల ఖర్చు కూడా రాక రైతులు పంటను పూర్తిగా వదిలేసుకున్నారని... ఈ ఏడాది ధరలు కొంచెం ఆశాజనకంగా ఉండడంతో వరుస నష్టాలతో దెబ్బతిన్న రైతులు... ఈసారైనా కోలుకోవచ్చన్న ఆశతో బంగారు నగలు తాకట్టు ద్వారా, వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పు చేసి ఉల్లి సాగు చేశారని తెలిపారు. విత్తనాలకు, దుక్కి దున్నడానికి, ఎరువులు, పురుగు మందులకు ఇప్పటికే ఎకరాకు 30 వేల రూపాయల దాకా ఖర్చు చేశారన్నారు. విత్తనాలు మొలక రాకపోవడంతో పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నేలపాలయ్యాయని తెలిపారు. తక్షణం వ్యవసాయ అధికారులు సాగు చేసి నష్టపోయిన ఉల్లి రైతుల వివరాలను నమోదు చేయాలని, యుద్ధ ప్రాతిపదికన శాస్త్రవేత్తలను పిలిపించి విత్తనం మొలక శాతాన్ని, జెనెటిక్ ప్యూరిటీని పరీక్షించి నివేదికలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పోలీసులు రైతుల నుంచి, వ్యవసాయ అధికారుల నుంచి ఫిర్యాదులు తీసుకుని కంపెనీ, డీలర్ల పై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు విత్తనాలను విక్రయించిన డీలర్ల లైసెన్సు రద్దుచేసి షాపులు సీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ సంఘటనపై ప్రత్యేక అధికారిని నియమించి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో నకిలీ విత్తన విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ నిరంతరం పర్యవేక్షణ చేసి నియంత్రించాల్సిన మండల వ్యవసాయ అధికారులు, జిల్లా అధికారులు, అరికట్టాల్సిన విజిలెన్స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసి బాదుల్లా, కమలాపురం మండల కార్యదర్శి పీ వరప్రసాద్, బాధిత రైతులు శైలజనాథరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వర మునీశ్వరమ్మ, వెంకటసుబ్బయ్య, ఈశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల

అభివృద్ధికి నిధులివ్వాలి

శివప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రజలు చెల్లించే పన్నుల్లో కొంత గ్రంథాలయాల కోసం కేటాయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని గ్రంథాలయాల నియామకాల్లో రాజకీయ జోక్యం ఉండరాదన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఎన్టీఆర్ జిల్లా శాఖ అధ్వర్యంలో బుధవారం స్థానిక ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహించారు. 'తెలుగునాట గ్రంథాలయ ఉద్యమం' అంశంపై శివప్రసాద్ ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్ మాట్లాడుతూ రచయితలు కాలానికి అనుగుణంగా రచనలు చేయాలన్నారు. మీని కవితలు రాయాలని సూచించారు. మరో గ్రంథాలయ ఉద్యమం ఆవశ్యకత ఉందని, రచయితల నుంచి పుస్తకాలు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. సభకు అరసం జిల్లా అధ్యక్షులు కొప్పర్తి రాంబాబు అధ్యక్షత వహించారు. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్ అభ్యుదయ గేయాలు ఆలపించారు. పరుచూరి అజయ్ కుమార్, మోతుకూరి అరుణకుమార్, ఠాగూర్ గ్రంథాలయం అధికారి కె.రమాదేవి, ఎస్టీయూ నేత ఎం.వేణుగోపాల్, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మందగళ్ల సాయి కుమార్, సాహితీవేత్తలు వెన్నా వల్లభరావు, బి.ఆంజనేయ రాజు పాల్గొన్నారు.

మోదీవి విచ్ఛిన్నకర విధానాలు

చలసాని వెంకట రామారావు

విశాలాంధ్ర - ఏలూరు: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహిస్తున్న మహాధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో బుధవారం ఏఐటీయూసీ ఏలూరు ఏరియా సమితి 21వ మహాసభ సీనియర్ నాయకులు కె.కృష్ణమాచార్యులు అధ్యక్షతన జరిగింది. చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం కార్పొరేట్‌లకు అప్పగిస్తోందని విమర్శించారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి రెండు జిల్లాలుగా విడిపోయిన సందర్భంగా ఏలూరు జిల్లా ఏఐటీయూసీ ప్రథమ మహాసభను ఏలూరులో డిసెంబరు 9,10 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభ జయప్రదం కావడానికి ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు బాధ్యత వహించాలన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాటాడారు. ఏఐటీయూసీ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి కె.కృష్ణమాచార్యులు కార్యకలాపాల నివేదిక సమర్పించారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కో కన్వీనర్ చాట్ల పుల్లారావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉప ప్రదంచీశీఅవగాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పలూరి హేమశంకర్ తదితరులు మాట్లాడారు.

కృష్ణమాచార్యులు

అప్పలరాజు

నూతన కమిటీ ఎన్నిక

ఏఐటీయూసీ ఏలూరు ఏరియా సమితికి 19 మందితో నూతన కమిటీ ఎన్నికయింది. గౌరవాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా కె.కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులుగా పుప్పాల కన్నబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎ.అప్పలరాజు, సహాయ కార్యదర్శులుగా కె.ఆది నరేష్, వి.దత్తు, ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి మరో 12 మందిని ఎన్నుకున్నారు.

ఓటర్ల జాబితా అక్రమాలపై సీఎం స్పందించాలి: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్న సందర్భంగా...దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు వివరణ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉండే ఓటర్లను తొలగించారని, ఒకే పేరుతో అనేకమందిని ఓటర్లుగా చేర్చారని, అలాగే ఒకే ఇంటిలో 125 మందికిపైగా ఓటర్లుగా నమోదవడం వంటి అనేక అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయని రామకృష్ణ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో లోపాలు, అక్రమాలు జరిగినట్లు రాజకీయ పార్టీలతో పాటు మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ కూడా ఆరోపణలు చేస్తున్నందున ఈ అంశంపై స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు ప్రజాస్వామ్యానికి అవమానకరమని వ్యాఖ్యానించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టి...నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా రూపొందించి అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రామకృష్ణ కోరారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగించుకోవాలి

విక్సిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభోత్సవంలో గవర్నర్ నజీర్

విశాలాంధ్ర-అరకులోయ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలని గిరిజనులకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్‌నజీర్ పిలుపునిచ్చారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా జన్ జాతీయ గౌరవ్ దివస్‌ను పురస్కరించుకొని విక్సిత్ భారత్ సంకల్పయాత్రను ఆయన అరుకులో ప్రారంభించారు. బిర్సా ముండా బ్రిటిష్ వలస వ్యవస్థ, దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. జన్ జాతీయ గౌరవ్ దివస్‌ను గిరిజనుల అద్భుత చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేసుకోవడానికి, పరిరక్షించడానికి జరుపుకుంటున్నామన్నారు. బిర్సా ముండా సహా గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును గవర్నర్ గుర్తుచేసుకున్నారు.అదే సమయంలో జార్ఖండ్ ప్రజలకు వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పీహెచ్‌సీ ధారకొండకు రెడ్‌క్రాస్ ద్వారా అందజేసిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. వన్ ధన్ మార్ట్, జీసీసీ, ఉజ్వల యోజన, సికిల్ సెల్ అనీమియా పరీక్ష కేంద్రం, ఛాయాచిత్ర ప్రదర్శన స్టాళ్లను తిలకించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఐటీడీఏ తరపున జ్ఞాపికను బహూకరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలు, హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బిర్సాముండా జయంతి సందర్భంగా గిరిజనాభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలను అమలు చేయాలని ప్రధాని యోచిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షులు జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్యేలు చెట్టిపాల్గుణ, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఏపీ గవర్నర్

విశాలాంధ్ర-విజయవాడ: వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో కలిసి ఆహ్వానించినట్లు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు శ్రీచైతన్యరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజరాజనరేంద్రుల వారి పట్టాభిషేక మహోత్సవ సహస్రాబ్ది సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్ సంస్థ, చైతన్య విద్యా సంస్థల సంయుక్త అధ్వర్యంలో 'ఆంధ్రమేవ జయతే!' పేరుతో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా 2024 జనవరి 5,6,7 తేదిలో సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం, గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మహాసభలు జరుగుతాయని తెలిపారు. అంతర్జాతీయ తెలుగు మహా సభలు నిర్వహిస్తున్న సందర్భంగా 5 జనవరి 2024 ఉదయం 9 గంటలకు జరిగే ప్రారంభోత్సవ సభలో ముఖ్య అతిథిగా గవర్నర్ పాల్గొంటారని పేర్కొన్నారు. తెలుగు మహాసభలలో నిర్వహించే అనేక అంశాలపై వివరణ ఇవ్వగా గవర్నర్ ఎంతో ఆశక్తిగా విన్నారని... తెలుగు మహా సభలకు ఎంతో సహకరిస్తున్న సేవా తత్పరులు, తెలుగు భాషాభిమాని శ్రీచైతన్య రాజుని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారని గజల్ శ్రీనివాస్ తెలిపారు.

కరువు నివారించాలి: దేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర-రాజోలు: రాష్ట్రంలోని 400 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ అన్నారు. కరువు నివారణలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విమర్శించారు. తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేగా ప్రభాకర్‌తో పాటు సీపీఐ స్థానిక నాయకుల బృందం బుధవారం కరువు మండలాలను పరిశీలించింది. సఖినేటిపల్లి మండలం అంతర్వేది, గొంది, వివి మెరక తదితర ప్రాంతాల్లో పర్యటించింది. అంతర్వేది, గొంది పరిసర ప్రాంతాలలో 25 ఏళ్లుగా వరి సాగులేదని, డ్రైనేజీ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటంతో భూములు మునిగిపోతున్నాయని నాయకులకు రైతులు తెలిపారు. కరువు మండలాల్లో పర్యటించిన బృందంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, నాయకులు కొండా సత్తిబాబు, మేడిచర్ల సత్యనారాయణ, దొండపాటి. చిట్టిరాజు, దీపాటి గాంగాచలం, పెదిరెడ్డి రామారావు, జి తిరుపతి, సీహెచ్ బెన్ని ఉన్నారు.

టీడీపీ ఖాతాలోకి 'స్కిల్' నిధులు: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ కుంభకోణంలో దోచుకున్న నిధుల్లో రూ.27 కోట్లు హవాలా మార్గంలో టీడీపీ ఖాతాలోకి మళ్లించినట్లు సీఐడీ గుర్తించిందని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. టీడీపీ ప్రధాన కార్యాలయానికి సీఐడీ నోటీసులు జారీచేసిందని తెలిపారు. ఆయన బుధవారం సామాజిక మాధ్యమంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇతర కుంభకోణాల నిధులు కూడా టీడీపీ ఖాతాలోకి ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు మళ్లించారని విమర్శించారు. ఈనెల18న సిట్ కార్యాలయానికి రావాలని, సమగ్ర వివరణ ఇవ్వాలని నోటీసులో సీఐడీ సూచించినట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. అదే సమయంలో బీజేపీ నేత పురంధేశ్వరిని విమర్శించారు. జాతి నేతగా ఎందుకు మారారని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా కారంచేడులో బీజేపీ తరపున సర్పంచ్ లేదా తన సొంత మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులను ఎందుకు పోటీలో పెట్టలేదని నిలదీశారు. బీజేపీ చెందిన చిన్న నేతలు అన్ని చోట్ల పోటీ చేశారని, మరి తానెందుకు ఆ పని చేయలేదని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలు అడిగితే ఆమె ఏం సమాధానం చెబుతారన్నారు. బావ కళ్లల్లో ఆనందం కోసం నిజం చెప్పేస్తారా అని చమత్కరించారు. తెలంగాణలో కాంగ్రెస్‌కి మద్దతుగా టీడీపీ పోటీ చేయొద్దని పురంధేశ్వరి సలహా ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు.

సంపాదకీయం

నితీశ్ దెబ్బకు బీజేపీ అతలాకుతలం

అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకన్నా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీలో అంతర్గత పరిణామాలు ఎక్కువ ఆసక్తికరంగా తయారయ్యాయి. ప్రతిపక్ష ఐక్య సంఘటనలో భాగస్వాములైన సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్‌కు మధ్య తలెత్తిన వివాదాలకన్నా కేంద్రంలోని బీజేపీ అధినాయకత్వానికి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ కు మధ్య విభేదాలు బీజేపీ భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఒక్క రాజస్థాన్ లోనే బీజేపీ విజయావకాశాలు మిణుకుమిణుకుమంటున్నాయి తప్ప మిగతాచోట్ల ఓటమి దాదాపు ఖాయమనిపిస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి ప్రధానమైన రాష్ట్రాలలో బీజేపీ ఎన్నికల ప్రచార సరళి కూడా బీజేపీని కలవర పెడ్తున్నాయి. ప్రధానమంత్రి మోదీ ఎన్నికల ర్యాలీలకు, ప్రచార సభలకు జనం పలచగా హాజరవుతున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎన్నికల సభల్లో ఖాళీ కుర్చీలే ఎక్కువగా కనిపించినందువల్ల ఆ సభలే రద్దు చేసుకోవలసి వచ్చింది. ఇవన్నీ బీజేపీకి గడ్డు రోజులేనన్న అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. ఈ ఎదురుదెబ్బలన్నీ ఇన్నాళ్లు రాజకీయ మంత్రాంగం నడిపిన గుజరాత్ లాబీకి వ్యతిరేకమైనవేనన్న భావనా కలుగుతోంది. అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలమాట ఎలా ఉన్నా 2024 సార్వత్రిక ఎన్నికలలో ఏదో విచిత్రం జరిగి బీజేపీ గెలిస్తే ప్రధానమంత్రి ఎవరు అన్న ప్రశ్న చుట్టూ బోలెడు రాజకీయం జరుగుతోంది. ఒకవేళ బీజేపీ విజయం సాధించినా మోదీ మూడోసారి ప్రధాని కావడం ఆ పార్టీలోనే కాకుండా ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్‌కు మినహా ఇతర అగ్ర నేతలకు ఇష్టం లేదన్న భావనలు గుసగుసల స్థాయి దాటాయి. మరో వేపున ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ కూడా ప్రధానమంత్రి పదవికి పోటీ పడొచ్చునన్న ఊహాగానాలు మోదీకి, అమిత్ షాకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. అందుకే యోగీ పీఠం కదిలించడానికి అమిత్ షా తెరవెనక ఉండి కేశవ్ ప్రసాద్ మౌర్య ద్వారా ప్రయత్నిస్తున్నారు. మౌర్య యోగీ ఆదిత్య నాథ్ మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి. ఇటీవల ఆయన యోగీ ఆదిత్యనాథ్‌తో ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. అయోధ్యలో జరిగిన మంత్రివర్గ సమావేశానికి హాజరుకాలేదు. దీపావళి సందర్భంగా యోగి నాయకత్వంలో జరిగిన దీపోత్సవానికి కూడా ఆయన రాలేదు. గత అయిదారేళ్ల నుంచి మౌర్యకు అడుగడుగునా నిరాశే ఎదురవుతోంది.

2017లో ఉత్తరప్రదేశ్ శాసనసభల ఎన్నికలకు ముందు ఆయనకు రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి కట్టబెట్టారు. ఆయన నాయకత్వంలో విజయం సాధించిన తరవాత అనూహ్యంగా యోగీ ఆదిత్యనాథ్‌ను ముఖ్యమంత్రిని చేసేశారు. 2022 ఎన్నికల తరవాత కూడా ఇదే జరిగింది. మౌర్యలో ఉన్న అసంతృప్తిని ఇప్పుడు అమిత్ షా ప్రోత్సహిస్తున్నట్టున్నారు. ఓట్లు సంపాదించేవారిని ఉపయోగించుకుని ఆ తరవాత పక్కన పెట్టడం బీజేపీలో కొనసాగుతున్న తంతే.

మౌర్య మొదటి నుంచి ఆర్.ఎస్.ఎస్. కుదురులో ఉన్న వారే. గోసంరక్షణ ఉద్యమంలోనూ ఆయన పాత్ర ఉండేది. 2022 ఎన్నికలలో మౌర్య అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయినా ఆయనను ఉపముఖ్యమంత్రిని చేశారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కులగణన జరిపించి ఆ వివరాలను బయటపెట్టిన తరవాత బీజేపీకి భవిష్యత్తు అంధకారమయంగా కనిపిస్తోంది. నితీశ్ రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియని బీజేపీ మౌర్య అసంతృప్తిని వాడుకునే ప్రయత్నం చేస్తున్నట్టు ఉంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో యు.పి.పాత్ర ఎప్పుడూ కీలకమైందే. ఆ రాష్ట్రంలో వెనుకబడిన, దళితుల జనాభా కూడా ఎక్కువే. యోగీ ఆదిత్యనాథ్ అగ్రవర్ణాలకు చెందిన ఠాకూర్. నితీశ్ కుమార్ బయటపెట్టిన కులగణన రాజకీయాల్లో ఒక జాలంగా మారిపోయింది. అలాంటి స్థితిలో ఠాకూర్ ముఖ్యమంత్రిగా ఉండడం తమకు నష్టంఅని బీజేపీ కేంద్ర నాయకత్వం భావిస్తోంది. కాన్షీరాం, ములాయం సింగ్ వెనుకబడిన వర్గాలవారికి రాజకీయాల్లో సుస్థిర స్థానం కల్పించినవారు. ఆ సంప్రదాయం కొనసాగించడం బీజేపీకి అసాధ్యం. కులగణన వివరాలపై ఎలా స్పందించాలో తెలియని అయోమయ స్థితిలో బీజేపీఉంది. మరోవేపు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజకీయ వ్యూహాలూ బీజేపీని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. వారిద్దరూ వెనుకబడిన, దళితుల భావాలను ప్రముఖంగా వ్యక్తీకరిస్తున్నారు. ఇంతవరకు అమిత్ షా చాణక్యంవల్ల కొనసాగిన సామాజిక సమీకరణలు కులగణనవల్ల పటాపంచలయ్యాయి. వెనుకబడిన వర్గాల వారిని విస్మరించే రాజకీయాలకు కాలం చెల్లిపోయిందని తేలిపోయింది. అందుకే బీజేపీ మౌర్య లాంటి వారిని ప్రోత్సహించి యోగీ ఆదిత్యనాథ్ ను పక్కన పెట్టే మార్గాలు అన్వేషిస్తోంది. కానీ యోగి అంత సులభంగా లొంగిపోయే వ్యక్తికాదు. ఆయన ఢిల్లీ దర్బారును కూడా గడగడలాడించగలిగిన సమర్థుడు. ఆర్.ఎస్.ఎస్.తో యోగీకి సన్నిహిత సంబంధాలున్నాయి. అదే సమయంలో మోదీ బీజేపీని, దానికి సైద్ధాంతిక స్ఫూర్తినిచ్చే ఆర్.ఎస్.ఎస్.ను కూడా తన గుప్పెట్లో పెట్టుకున్నారు. అయితే రాజకీయ చదరంగంలో ఏదైనా సాధ్యమే. పటిష్ఠంగా ఉందనుకునే అధికారం చిటికెలో జారిపోగలదు. తిరుగులేదనుకున్న నాయకులు తెరమరుగు అయిపోవచ్చు. యు.పి.రాజకీయాల్లో మరో ప్రభావశీల వ్యక్తి పంకజ్ చౌధరి. ఆయన కేంద్రంలో ఆర్థిక శాఖ సహాయమంత్రిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ రాజకీయాలలో ఆయన ప్రభావం చాలా ఎక్కువ. ఇటీవల మోదీ ఉత్తరప్రదేశ్ వెళ్లినప్పుడు గోరఖ్ నాథ్ ఆశ్రమానికి వెళ్లలేదు కానీ పంకజ్ చౌధరీ ఇంటికి వెళ్లారు. కుల సమీకరణల్లో కూడా పంకజ్ చౌధరి ప్రభావం ఉంటుంది. ఆయన కూర్మి సామాజిక వర్గానికి చెందినవారు. ఆ వర్గం జనాభా ఉత్తరప్రదేశ్‌లో అయిదు నుంచి ఆరుశాతం దాకా ఉంటుంది. నితీశ్ కుమార్ రాజకీయాలను ఎదుర్కోవడానికి బీజేపీకి కనిపిస్తున్నది పంకజ్ చౌధరీ మాత్రమే. నితీశ్ కుమార్ సైతం కూర్మి సామాజిక వర్గానికి చెందినవారే అయినా ప్రస్తుతం ఆయన వెనుకబడిన, అత్యంత వెనుకబడినవర్గాల ఆశాజ్యోతిగా ఎదిగారు. సామాజిక న్యాయానికి నితీశ్ ప్రతీకగా మారారు. దళితుల్లో కూడా మహా దళితులకు నితీశ్ ప్రత్యేక కోటా కల్పించారు. నితీశ్ కుమార్ చాతుర్యం కలిగిన రాజకీయ నాయకుడు కనకే గత రెండు దశాబ్దాలుగా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. బీజేపీ కన్నా జె.డి. (యు) సీట్లు తక్కువైనా నితీశే ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు కూడా లాలూ నాయకత్వంలోని ఆర్.జె.డి.కి కన్నా తక్కువ స్థానాలున్నా ముఖ్యమంత్రి స్థానంలో నితీశే ఉన్నారు. బీజేపీతో కలిసి అధికారంలో ఉన్నప్పుడూ నితీశ్ బీజేపీ ఎజెండాను సమర్థించలేదు. ఆయన సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నా అగ్రవర్ణాల వారూ ఆయనను సమర్థిస్తారు. ఇలా సమన్వయంతో పనిచేసే రాజకీయ నాయకుడు దేశంలోనే మరొకరెవరూ లేరు. ఇంకోవేపు రాహుల్ గాంధీ అగ్రవర్ణానికి చెందిన వారైనా నిరంతరం వెనుకబడిన, దళితుల, ఆదివాసుల సమస్యలను లేవనెత్తి దేశవ్యాప్తంగా అభిమానం సంపాదించుకుంటున్నారు. మోదీ ఎంతటి శక్తిమంతుడైన నాయకుడైనా ఆయన పలుకుబడి ఉత్తరాదికే పరిమితం. నితీశ్ కదిలించిన తేనె తుట్టె ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ రాజకీయాలను అతలాకుతలం చేసింది.

సమాజాన్ని చీల్చిందెవరు

సమాజంలో అసమానతలకు కారణం తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఆంగ్లేయుల పాలన నుండి ఇప్పటివరకు డివైడ్ అండ్ రూలుతో భారతీయుల్ని చీల్చి పాలించారని ఆది నాటినుండి ఇప్పటివరకు రాజకీయ నాయకులు, కొంతమంది మేధావులు ఆ పదం వాడుతూనే ఉన్నారు. కాని వేల సంవత్సరాల నుండి మనువును నెత్తిన పెట్టుకుని చాతుర్వర్ణం ఆ తరువాత పంచమ వర్ణాలుగ విభజించలేదా. ఇన్ని మతాలు, వందల కులాలుగ విభజించింది ఆంగ్లేయుల పాలనలో కాదు గదా. స్వాతంత్ర్య పోరాటంలో భారతీయులందరిని ఏకంచేసి పోరాటంలో పాల్గొనచేసే ఉద్దేశంతో ఎవరో ఒకరు విభజించి పాలించు అనే పదం వాడితే ఇప్పటికే ఆ పదాన్ని వల్లె వేయడంతప్ప అసలు ఇన్ని మతాలుగ, కులాలుగ విడిపోవడానికి కారకుల గురించి ఆలోచించకపోవడం శోచనీయం. గత 75ఏళ్లుగా ఉన్న పార్టీ చీలికకు కారణం బ్రిటీష్‌వారు కాదు. కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు చీలికకు బ్రిటీషువారు కాదు గదా. ఆధారరహితంగా, ఆలోచనా రహితంగా ఇప్పటికీ ఆ పదం రాజకీయ నాయకులు వాడుతూనే ఉన్నారు. విభజించి పాలించడమనేది భారతీయ సంస్కృతిలో వేలాది సంవత్సరాలుగ ఉందనే విషయం ముందు తెలుసుకోవాలి. మనదేశంలో ఏ ఒక్క మతంలోనూ సఖ్యతలేదు.

అసలు భారత సమాజాన్ని చీల్చిన వారు మను సిద్ధాంతాన్ని నెత్తిన పెట్టుకున్న వైదిక ఆర్యులనే చెప్పాలి. మన దేశ సంస్కృతిని ఆ దిశగా తీర్చిదిద్దినవారు వైదిక ఆర్యులే. మనుషుల్ని చీల్చడమనేది మన పురాణాల్లోనే మొదలైంది. తండ్రి కొడుకులైన హిరణ్యకశిపుడిని విష్ణువుతో చంపించి ప్రహ్లాదుడికి రాజ్యం కట్టబెట్టారు. అలాగె నాస్తికుడని ముద్రవేసి వేనరాజును కొడుకు పృధువుతో చంపి పృధువుకు రాజ్యం కట్టబెట్టింది ఆనాడు గౌతమ మహర్షి. వాలిని చంపించి తమ్ముడికి రాజ్యం కట్టబెట్టింది ఆర్యులే కదా! ఇలాంటి ఉదాహరణలు పురాణాల్లో అనేకం ఉన్నాయి. అందుకె విభజించి పాలించడం నేర్పింది ఆంగ్లేయులు కాదని, మను సంస్కృతిని నెత్తిన పెట్టుకున్న ఆర్య సంస్కృతిదని తెలుసుకోవాలి.

ఇక చరిత్రలోకి తొంగిచూస్తే చంద్రగుప్తుడిని సింహాసనంపై కూర్చోబెట్టిన చాణుక్యుడు ఆంగ్లేయుల కాలంనాటి వాడు కాదు. జయచంద్రున్ని చీల్చి పృధ్విరాజును ఓడించి మహమ్మద్‌ఘోరీకి తోడ్పడింది ఆంగ్లేయుడు కాదు. హరిజనులను ఊరి బయట పెట్టింది మను సిద్ధాంతమె తప్ప ఆంగ్లేయులు కాదు. బ్రిటనులో లేని ఇన్ని మతాలు కులాలుగ ఏర్పడి మత యుద్ధాలకు కారకులు ఆంగ్లేయులు కాదు. దేశ జనాభాలో ఎక్కువ మంది హిందువులె కనుక మను సిద్ధాంతం హిందువుల సంస్కృతి కనుక ఈ వైషమ్యాలకు మనువును నెత్తిన పెట్టుకున్న హిందూ సంస్కృతినె కారణంగా చెప్పవచ్చు. ప్రస్తుతం మన దేశంలోని క్రైస్తవులు గతంలో హిందువులె కదా. అలాగె మహ్మదీయులు అరబ్బుప్రాంతాల నుంచి రాలేదని, హిందూ మత ఆంక్షలు భరించలేక మహ్మదీయులుగా, క్రైస్తవులుగా మతాన్ని స్వీకరించి ఉండవచ్చు. మత మార్పిడికి కారణం హిందూమత ఆంక్షలే కారణం కావచ్చు. తోటి పేద హిందుకు గుప్పెడు మెతుకులు పెట్టకుండ పెట్టే మతాన్ని స్వీకరిస్తే మత మార్పిడి జరగరాదనడం ఏమి న్యాయం. అసలు మనిషి మనుగడకు మతంతో పనిలేదు. వారి దేశంలో లేని మతాలు, కులాలు ఇక్కడ కల్పించారనేది అవివేకం. కవిరాజు త్రిపురనేని యిలా అంటాడు. "ఒకడు వేదమె భగవదుక్తమటంచు వుపన్యసించు వేరొకడు తన ఖురాన్ భగవదుక్తమని, మరొకడు బైబిల్ భగవదుక్తమని వాదులాడు ఈ తికమకలేల పెట్టెదవు తెల్పకరాదె నిజంబు ఈశ్వరా" అంటాడు. ఎవరి మత గ్రంథం వారు దేముడని నమ్ముతున్నారు. ఒక మతమంటె మరొకరికి పడదు. ఈ మత యుద్ధాలు కూడ ఆంగ్లేయులె కల్పించారనుకోవాలా. ఇప్పటికైనా మన సంస్కృతిని పూర్తిగా అర్థం చేసుకుని వాదులాడటంమాని అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలి. ప్రస్తుతం మన ప్రభుత్వాలు కూడ ప్రతిపక్షాలను చీల్చి పాలించె ఆలోచనలు చేస్తూనే ఉన్నాయి. ఇవి కూడ ఆంగ్లేయులె నేర్పారనడం హాస్యస్పదం. ఇకనైనా ఆ మాట వల్లె వేయడం మానాలి. కనుక ఆంగ్లేయుల పాలన కంటె ముందె ఆర్య సంస్కృతి విభజించిందనే సంగతి గుర్తించాలి.

సెల్:96855 69394

రాజస్థాన్‌లో సంప్రదాయం మారుతుందా?

మక్కెన సుబ్బారావు

కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో ఈ నెల 25న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలకు ప్రతిష్ఠాత్మకం. ప్రతి ఎన్నికల్లో అధికారం చేయిమారటం గత మూడు దశాబ్దాల సాంప్రదాయంగా వస్తోంది. తన 'సంక్షేమ' పాలన దాన్ని తిరోముఖం పట్టిస్తుందని కాంగ్రెస్ నమ్ముతోంది. ఆ దిశగా శక్తియుక్తులు ధారపోస్తున్నది. అయితే రాజస్థాన్ ప్రజలు సాంప్రదాయం నిలబెడతారని బీజేపీ విశ్వసిస్తోంది. అయితే నమ్మకం మీదే ఆధారపడకుండా, ప్రధానమంత్రి మొదలు ఆ పార్టీ అధినాయకత్వం ఓటర్లకు ఆకర్షణపూరిత 'ఉచిత' ప్రదానాల వాగ్దానాలతో పాటు మైనారిటీల వ్యతిరేక మనోభావాలు ప్రేరేపిస్తూ హిందూ ఓట్లను కూడగట్టేందుకు నిర్విరామ కృషిచేస్తోంది. బీజేపీకి మాజీ రాజ సంస్థానాలు వెన్నుదన్ను. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖీ పోటీ ప్రధానంగా ఉండే ఆరేడు హిందీ రాష్ట్రాల్లో మూడింటిలో (మధ్యప్రదేశ్,రాజస్థాన్,చత్తీస్‌ఘడ్) ఈ నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున వాటి ఫలితాలు 2024 లోకసభ ఎన్నికలకు నిస్సందేహంగా దిక్సూచీ. అది ఈ ఎన్నికలకు అదనపు ప్రాముఖ్యతను చేకూర్చింది. బీజేపీ మధ్యప్రదేశ్‌లో వలె రాజస్థాన్‌లో ఐదుగురు ఎంపీలను అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దించింది. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజెకు ఒకింత ప్రాధాన్యత తగ్గించటం ఆమెకు ముఖ్యమంత్రి పదవికి పోటీనుండి తప్పించటానికేనని భావిస్తున్నారు. రాజ్ సమంద్ ఎంపీ, పూర్వపు జైపూర్ రాజ కుటుంబ సభ్యురాలైన దియాకుమారి పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రజలు ఆసక్తితో గమనిస్తున్నారు. అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ సహా మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థులను ప్రకటించలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరుతో కమలం గుర్తుకు ఓట్లు అర్థిస్తున్నది. బీజేపీ నాయకత్వ మార్పును తలపెట్టిందని ఓటర్లు భావిస్తున్నప్పటికీ, తమది సమిష్టి నాయకత్వం పేరుతో పార్టీ నాయకులు దీన్ని సమర్థించుకుంటున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు కూడా ప్రధానమంత్రి అభ్యర్థి ముఖం లేకుండా దేశ ప్రజల ముందుకు వెళతారా?

కాంగ్రెస్‌కు సంబంధించినంతవరకు ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ప్రజాభిమానం చూరగొన్న ప్రముఖ నాయకుడు. ఆయన తన అనుయాయులు, అభిమానుల కోసం కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవికన్నా ముఖ్యమంత్రి పదవినే ఎంచుకున్నారు. రెండూ కావాలనుకున్నా ఆయన వాదనను అధినాయకత్వం నిరాకరించటంతో రాష్ట్రానికే పరిమితమైనారు. ఆ సందర్భంలో రాష్ట్ర కాంగ్రెస్ పూర్వాధ్యక్షుడు సచిన్‌పైలెట్ భంగపడక తప్పలేదు. ఆ అసమ్మతిని రాహుల్‌గాంధి, ప్రియాంక నాయకత్వ జోడీ బుజ్జగించడంవల్ల ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐక్యంగా పని చేయగలుగుతుంది. మంచి ఫలితాలు ఆశిస్తోంది. ఈ ఎన్నికల్లో రెండు నినాదాలు ప్రజలను

ఆకర్షిస్తున్నాయి. తన ప్రభుత్వ సంక్షేమ ఫథకాల అమలులో విశ్వాసముంచిన గెహ్లోత్, "కామ్ కియా హై దిల్ సే, కాంగ్రెస్ ఫిర్ సే" (మనస్సు పెట్టి పనిచేశాం. కాంగ్రెస్‌కు మళ్లీ అధికారమివ్వండి) అంటున్నారు. కాగా బీజేపీ "నహీ సహేగా రాజస్థాన్"(రాజస్థాన్ సహించదు) అంటోంది. అభ్యర్థుల ఎంపికలో సిగపట్లు, అటు ఇటు టికెట్ దాని సిట్టింగ్‌లు జంపింగ్‌లు షరా మామూలే. కాంగ్రెస్‌కు సంబంధించి గెహ్లోత్‌పై ఓటర్లలో ఉన్న సద్భావన ఎంఎల్‌ఏలపై తక్కువగా ఉండటం కనిపిస్తోంది. అయినా కాంగ్రెస్ 100 మంది సిట్టింగ్‌ల్లో 67 మందిని మళ్లీ నిలబెట్టింది.

రైతుల రుణ మాఫీ, ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, మత ఉద్రిక్తతలు, సామాజిక భద్రత అంశాలు ఎన్నికల క్షేత్రంలో ప్రభావవంతంగా కనిపిస్తున్నాయి. యువత బహుముఖ అభివృద్ధితో ఉపాధి కల్పించగల ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. భౌగోళిక విభజనపరంగా చూస్తే ఉత్తర రాజస్థాన్‌లో అసెంబ్లీ సీట్లు 50 అసెంబ్లీ సంఖ్యాబలంలో నాల్గవవంతు. ఇక్కడ రైతు సమస్యలు ప్రధానం. జాట్లు, ముస్లిం, యాదవ సముదాయాలకి ప్రాబల్యం. కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దేశవ్యాప్త ఉద్యమంలో ఈ రైతు ప్రధానప్రాంతం పెద్దఎత్తున పాల్గొన్నది. దక్షిణ రాజస్థాన్‌లో కొత్తగా ఏర్పడిన భారతీయ ఆదివాసీ పార్టీ బీజేపీ, కాంగ్రెస్ రెండింటి ఓట్లకు గండికొడుతుంది. ఎక్కువ నష్టం ఎవరికో డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు వరకు ఆగాల్సిందే. కాగా రాష్ట్రీయ లోక్ తాంత్రిక్‌పార్టీ, ఆమ్‌ఆద్మీ పార్టీ కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రజలకు భరోసా యిస్తున్నా అరడజను గ్యారంటీల్లో చిరంజీవి ఆరోగ్య బీమా, పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ, రూ.500లకు వంటగ్యాస్ సిలెండర్లు, మహిళలకు స్మార్ట్‌ఫోన్‌లు, సామాజిక భద్రత అలవెన్స్ ఉన్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే అమలు జరుగుతున్నాయి. చిరంజీవి యోజన-ప్రభుత్వ సార్వజనీన వైద్య బీమా పథకం రూ.25లక్షల వరకు కవరేజి, వితంతువులు, విద్యార్థినులకు స్మార్ట్‌ఫోన్‌లు, 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాష్ట్ర ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఛార్జీలో 50శాతం రాయితీ. కాగా బీజేపీ మతం, కులం ప్రాతిపదికగా ప్రజలను విభజించటంతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను అస్త్రాలుగా ఉపయోగిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.

కాంగ్రెస్ కొత్తగా ప్రకటించిన కొత్త గ్యారంటీల్లో పాత పెన్షన్ పథకంపై చట్టం, ప్రభుత్వ కాలేజి విద్యార్థినిలకు లాప్‌టాప్‌లు లేదా టాబ్‌లెట్లు, ఇంగ్లీషు మీడియంలో ఉచితంగా స్కూలు విద్య ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాలకు రూ.15లక్షలు బీమా రక్ష, మహిళా కుటుంబ పెద్దలకు వాయిదాల్లో సంవత్సరంలో రూ.10వేలు గౌరవభృతి. అలాగే గెహ్లోత్ ప్రభుత్వం చత్తీస్‌ఘడ్ వలె గోదాన్ స్కీం ప్రకటించింది. దీనికింద పశుపోషణలకు నుండి ప్రభుత్వం ఆవుపేడను కిలో రెండురూపాయల చొప్పున కొనుగోలు చేస్తుంది. స్కూళ్లలో ఇంగ్లీషు మీడియం ఈ ఎన్నికల్లో వివాదాంశం కావటం విశేషం. మహాత్మాగాంధి ఇంగ్లీషు మీడియం స్కూళ్లను ప్రభుత్వం 2019లో ప్రారంభించింది. ఇది చాలా ఆకర్షణీయమై సీట్లకన్నా అనేక రెట్లు దరఖాస్తులు వస్తున్నాయి. ప్రభుత్వం తొలుత 33 జిల్లాల్లో ఒక్కొక్క స్కూలు ప్రారంభించింది. ఈ నాటికి వాటి సంఖ్య 3355కు పెరగటం అపూర్వమనాలి. మారిన ఉపాధి మార్కెట్ పరిస్థితుల్లో కిందిస్థాయి ప్రజల్లో ఇంగ్లీషు మీడియంపట్ల పెరిగిన ఆకర్షణకు ఇది అద్దంపడుతోంది. కాగా బీజేపీ కులజనగణన విషయంలో వెనకపట్టుపట్టినట్లు హిందీ రాష్ట్రాల్లో ఇంగ్లీషు మీడియం విద్యకు ప్రోత్సాహంపై తటపటాయిస్తున్నది. జాతీయ విద్యావిధానం ప్రకారం త్రిభాషా సూత్రాన్ని చిత్తశుద్ధితో ఆచరించి ఉన్నట్లయితే బోధనా మాధ్యం డిమాండ్‌ను కూడా మార్కెట్ నిర్ణయించి ఉండేది.

రాజస్థాన్‌లో 2018లో ఎన్నికల ఫలితాల తీరు
మొత్తం సీట్లు :200 ఎస్‌సీ 34, ఎస్‌టీ25.
మొత్తం ఓటర్లు : 5,26,80,545.

పార్టీ	2018	ఓటు శాతం	2013	ఓటు శాతం	2008	ఓటు శాతం
కాంగ్రెస్	100	39.30	21	33.07	96	36.82
బీజేపీ	73	38.77	163	45.17	78	34.27
బీఎస్‌పీ	6	4.03	3	3.37	6	7.60
సీపీఐ(ఎం)	2	1.22	0	0.87	3	1.62
ఇతరులు	6	7.21	6	9.31	3	4.73
ఇండి	13	9.47	7	8.21	14	14.96

కాలుష్యం గుప్పిట్లో మహానగరాలు

ప్రతి ఏట చివరి త్రైమాస శీతాకాల సమయంలో మహానగరాలు గ్రహణ గాలి కాలుష్య కోరల్లో చిక్కుకొని నగరవాసుల ఆరోగ్యాలను హరించే ప్రయత్నాలు చేయడం సర్వసాధారణం అయింది. రాజధాని ఢిల్లీ మహానగరం దట్టమైన ప్రమాదకర పొగమంచు గుప్పిట్లో మసకబారుతున్నది. నగరవాసుల ఆయుర్దాయం 10 శాతం వరకు తగ్గే అవకాశం ఉన్న గాలికాలుష్య సమస్య ఉత్పన్నానికి వివిధ కారణాలు ఉన్నాయి. చికాగోకు చెందిన 'ఎనర్జీ పాలసీ ఇనిస్టిట్యూట్' అధ్యయన వివరాల ప్రకారం అత్యంత కాలుష్య 10 ప్రపంచ నగరాల్లో 6, 20 నగరాల్లో 14, 50 ప్రపంచ నగరాల జాబితాలో 39, 100 నగరాల జాబితాలో 65భారత నగరాలు ఉండడం మన మహానగరాల దుస్థితికి అద్దం పడుతున్నది. గాలి కాలుష్య నగరాల్లో ప్రజల సగటు ఆయుర్దాయం 5.3 ఏండ్లు తగ్గడం, ప్రమాదకర ఢిల్లీ నగరవాసుల ఆయుర్దాయం 11.9 ఏండ్ల వరకు తగ్గవచ్చని అంచనా.

నేడు ఢిల్లీలో నెలకొన్న ప్రాణాంతక గాలి కాలుష్యం దృష్ట్యా మహానగర పరిధిలో 'లాక్‌డౌన్' విధించాల్సిన దుస్థితి వచ్చినట్లు తోస్తున్నది. ప్రమాదకర గాలికాలుష్య సంక్షోభ విషయంపై సుప్రీంకోర్టు కూడా సీరియస్‌గా తీసుకొని వివిధ కట్టడి చర్యలు తీసుకోవాలి. హర్యానా, పంజాబ్, రాజస్థాన్, యూపీ రాష్ట్రాల్లో రైతులు వ్యవసాయ వ్యర్థాలను విచక్షణారహితంగా కాల్చివేయడాన్ని తక్షణమే ఆపడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అత్యున్నత న్యాయస్థానం సూచించింది. పరస్పర నిందలు, విమర్శలను మానుకొని విషతుల్య గాలి కాలుష్య పొగమంచును తగ్గించడానికి సమిష్టిగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని కోర్టు తెలిపింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) విలువ 0-50 ఉన్నప్పుడు ఉత్తమంగా(గుడ్), 51-100 వరకు మాడరేట్‌గా, 101-150 వరకు సున్నితులకు అనారోగ్యకరంగా, 151-200 వరకు అనారోగ్యంగా, 201-300 వరకు తీవ్ర అనారోగ్యంగా, 301 దాటినపుడు ప్రమాదకరంగా వర్గీకరించారు. ప్రస్తుతం వివిధ ప్రధాన మహానగరాల్లో ఏక్యూఐ విలువలు ఢిల్లీలో 358, కొల్‌కతాలో 175, అహ్మదాబాదులో 156, ముంబాయిలో 126, చెన్నైలో 79 నమోదయ్యాయి. నగర గాలి కాలుష్యంలో పిఎం2.5, పిఎం10 విలువలు కూడా రికార్డు చేశారు. అత్యంత కాలుష్య రాష్ట్రాల జాబితాలో ఢిల్లీ, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, యూపీలు నమోదయ్యాయి. మహానగరాల తీవ్ర గాలికాలుష్యాలకు కారణాలుగా శిలాజ ఇంధన వాహనాల పొగ, పారిశ్రామిక ఉద్గారాలు, రోడ్ల దుస్థితులతో దుమ్ము, ధూళి రేగడం, వడనిర్మాణ రంగ కాలుష్యం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయడం లాంటివని గుర్తించారు. నగరాల గరళ గాలి కాలుష్యం కారణంగా కళ్ల మంటలు, శ్వాస ఇబ్బందులు, ఉబ్బసం సమస్యలు, గొంతు/ముక్కు సమస్యలు, దగ్గు, హృదయనాళ ఇబ్బందులు కలుగుతాయి. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగుళూరు, లక్నో, హైదరాబాదు లాంటి మహానగరాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్, ఏక్యూఐ ప్రమాణాలు పరిమితులను దాటి అత్యంత ప్రమాదకర పరిమాణాల్లో ఉంది. సుస్థిర పట్టణీకరణ, రోడ్ల ఏర్పాటు, ప్రజా రవాణాను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచడం, ప్రైవేట్ వాహనాలను తగ్గించడం లేదా ప్రత్యేక రద్దీ పన్నులను విధించడం, వాహనాల పరిస్థితిని పరీక్షించడం, కార్యాలయవేళల్ని వేరు వేరు సమయాలుగా వర్గీకరించడం, సైకిల్ దారుల ఏర్పాటు, నిర్మాణ రంగాన్ని నియంత్రించడం, శిలాజ ఇంధన వాహనాలను కట్టడి చేయడం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా ప్రత్యామ్నాయాలను శోధించడం, కాలుష్య కారణ పారిశ్రామిక కాలుష్య నియంత్రణ, రోడ్లపై దుమ్ము రేగకుండా చూడడం, ట్రాఫిక్ రద్దీని సమయాలను శాస్త్రీయంగా తగ్గించడం, హరిత వాతావరణం, నీటి నిల్వలను పెంచడం లాంటి చర్యలు నగర కాలుష్యాన్ని తగ్గిస్తాయి. ముఖ్యంగా వాహన కాలుష్యం 60శాతం, నిర్మాణ కార్యకలాపాలతో 10శాతం గాలి కలుషితం అవుతున్నట్లు తేల్చారు.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, ఫోన్949700037

కర్నాటకలో చెల్లని మోదీమాట!

ఎం కోటేశ్వరరావు

దేశంలో ఎక్కడైనా ప్రధాని నరేంద్రమోదీ హవా నడుస్తుందేమో గానీ కన్నడ సీమలో చెల్లదని అధికార రాజకీయాల్లో తలపండిన కర్నాటక మాజీ సిఎం బిఎస్ ఎడియూరప్ప తనకు తిరుగులేదని నిరూపించుకున్నారు. ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు తప్ప మాకుటుంబానికి వర్తించవు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా తన కుమారుడి నియామకంలో నరేంద్రమోదీయే అంతిమ నిర్ణయం తీసుకున్నారని కుండబద్దలు కొట్టారు. బీజేపీ విలువల వలువలను నడిబజారులో విప్పేశారు. వారసత్వ రాజకీయం అని ఎవరైనా అంటే అనుకోనివ్వండి లెక్క చేయను అన్నారు. కుటుంబ, వారసత్వ రాజకీయాలు, ఒకే కుటుంబానికి వివిధ పదవులకు వ్యతిరేకం అని సుభాషితాలు చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ తన మాటలను తానే దిగమింగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎడియూరప్పవేసిన తాళంతో బహుశా ఇంక ఎక్కడా వారసత్వ రాజకీయాల గురించి ఇతర పార్టీల మీద ఎక్కక పోవచ్చు. ఎడియూరప్ప కుమారుడు, తొలిసారి ఎంఎల్‌ఏగా గెలిచిన బివై విజయేంద్రను కర్ణాటక పార్టీ అధ్యక్షుడిగా బీజేపీ అధిష్టానం నియమించింది. ఎడియూరప్ప పార్టీ పార్లమెంటరీ బోర్డు పదవిలో ఉన్నారు. మరో కుమారుడు రాఘవేంద్ర లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. కర్ణాటక రాజకీయాల గురించి తెలిసిన వారికి ఎడియూరప్ప కుటుంబం ఒక రాజకీయ సైనికపటాలం వంటిది. ముగ్గురు కుమార్తెలు, వారి కుటుంబాలు, ఇద్దరు కుమారులు వారి కుటుంబాలు ఎవరు చక్కపెట్టాల్సినవాటిని వారు చేస్తారు. ఇప్పటివరకు వారి మధ్య ఎలాంటి పేచీలు రాలేదు. గతంలో ఎడియూరప్ప కాబినెట్ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప పదవిలో ఉండగానే గవర్నర్‌కు ఐదు పేజీల లేఖరాసి సిఎం కుటుంబం ఎలా జోక్యం చేసుకుంటున్నదో వివరించారు. అనేక మంది విధిలేక మౌనంగా ఉన్నారు. ఇవన్నీ అధిష్టానానికి, ప్రత్యేకించి నరేంద్రమోదీకి తెలియదు అనుకుంటే అంతకంటే అమాయకత్వం మరొకటి ఉండదు.

తన కుమారుడిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించటం గురించి ఎడియూరప్ప నాటకాన్ని రక్తి కట్టించారు. బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ, మీరు నమ్మండి.. నమ్మకపోండి, ఈ నియామకం గురించి మేమెవరం ఊహించలేదు. ఒక్కసారి కూడా ఢిల్లీలో ఈ విషయమై ఏ నాయకుడినీ అడగలేదు. కావాలంటే మీరు ఎవరినైనా అడగండి అని ఒక విలేకరి ప్రశ్నకు చెప్పారు. "అంతిమ నిర్ణయం ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా తీసుకున్నారు, నాకేమీ సంబంధం లేదు." అన్నారు. వారు తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకున్నారు. విజయేంద్రను అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్రమంతటా ఉత్సవాలు జరుపుకుంటున్నారని ఎడియూరప్ప చెప్పారు. బీజేపీలో వారసత్వ రాజకీయాలకు ఈ నియామకం రుజువుఅని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్య గురించి మాట్లాడుతూ వారు అలాంటి ఆరోపణ చేయనివ్వండి పట్టించుకోను అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 28గాను 25 చోట్ల గెలిచేందుకు తాను, విజయేంద్ర విడివిడిగా రాష్ట్రంలో పర్యటిస్తామని చెప్పారు. తన కుమారుడి నియామకం పట్ల పార్టీలో నేతలెవరూ అసంతృప్తిని వెల్లడించలేదని, అందరూ ఐక్యంగా స్వాగతించారని, ఎవరూ పార్టీని వీడకుండా తాము చూస్తామని, గతంలో వెళ్లిన వారిని కూడా వెనక్కు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని ఎడియూరప్ప చెప్పారు.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఎదురుదెబ్బ తిన్న బీజేపీ ఆరు నెలలుగా దిక్కుతోచని స్థితిలో పడింది. ఎంతగా మైండ్‌బ్లాక్ అయిందంటే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని, శాసనసభా పక్షనేతను కూడా ఎన్నుకోలేకపోయింది. ప్రతిపక్షనేత లేకుండానే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మరో ఆరునెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలన్న ఏకైక లక్ష్యంతో బీజేపీ ఉంది. కుటుంబ పార్టీ అంటూ గతంలో తెలుగుదేశాన్ని, తెలంగాణాలో బిఆర్‌ఎస్‌ను విమర్శిస్తున్న ఆ పార్టీ కర్ణాటకలో కుటుంబ పార్టీగా ఉన్న జెడిఎస్‌ను తన మిత్రపక్షంగా చేర్చుకుంది. కాంగ్రెస్‌ను కుటుంబ వారసత్వపార్టీ అని ధ్వజమెత్తుతున్న అదే పార్టీ ఎదుటివారికి చెప్పేటందుకే నీతులు అన్నట్లుగా ఎడియూరప్ప కుమారుడిని పదవికి ఎంపిక చేసింది. కర్ణాటక శాఖను ఒక కుటుంబ పార్టీగా మార్చివేసింది. ఎడియూరప్ప గాలి తీసి పక్కన పెట్టాం గనుక లింగాయత్ సామాజిక తరగతి దూరం కావటంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం జరిగిందన్న వాదనను పార్టీ గుర్తించినట్లుంది. తిరిగి వారిమద్దతు పొందాలంటే మరోదారి లేదని భావించి ఆ పెద్దమనిషి కుటుంబ వారసుడినే అధ్యక్షుడిగా నియమించింది. ఎంతవారలైనా అధికార కాంతదాసులే, నరేంద్రమోదీ ఆ కోవకు చెందిన వ్యక్తే గనుక చేసేదేముంది, సరే అనక తప్పలేదు. దీంతో పార్టీలో ఇప్పుడు ఎడియూరప్ప వ్యతిరేకులు ఏం చేస్తారన్నది ఆసక్తికరం. కాళ్లబేరానికి వస్తారా ? తిరుగుబాటు చేస్తారా ? తన కుమారుడి నియామకానికి నరేంద్రమోదీ అంతిమ నిర్ణయం తీసుకున్నారని ఎడియూరప్ప చెప్పిన తరువాత దాన్ని ధిక్కరించే సాహసం బీజేపీలో ఎవరికైనా ఉందా అంటే సందేహమే. అవమానాలను దిగమింగి లోలోపల కుములుతూ పార్టీలోనే ఉండాలి లేదా వెళ్లిపోవాలి. పార్టీ పదవి పంచాయతీ తేలింది, ఓట్ల రాజకీయం గనుక వెంటనే శాసనసభా పక్ష నేతను కూడా ఎన్నుకుంటారు, లింగాయత్ కాని వారే అవుతారు.

నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం: పైలట్

ఇండోర్: దేశంలో ఐదు రాష్ట్రాలకు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కనీసం నాలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని... 2024 సార్వత్రిక ఎన్నికల్లో గాలి ఎటువైపు వీస్తుందో స్పష్టంగా తెలియజేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకంపై భిన్నాభిప్రాయాల వల్ల ప్రతిపక్ష ఇండియా కూటమి చీలిపోతుందన్న చర్చను త్రోసిపుచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటును ఇవేమీ అడ్డంకి కాబోవన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్న పైలట్... హెలికాప్టర్‌లో పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... 2024లో బీజేపీని ఓడించడానికి ఇండియా కూటమి పక్షాలన్నీ కలిసి పనిచేయడానికి కట్టుబడి ఉన్నాయన్నారు. ఎవరు ఏ స్థానం తీసుకుంటారనేది ఎన్నికల తర్వాత నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరాంలలో రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పనితీరు గురించి అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ...కాంగ్రెస్ పార్టీ కనీసం నాలుగు రాష్ట్రాల్లో గెలిచి ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోతోందన్నారు. 'మేము అందుకున్న సమాచారం... మా సమావేశాల్లో వచ్చిన స్పందనను బట్టి బీజేపీపై ప్రజల్లో విశ్వాసం లేదని నేను చెబుతున్నాను. కాబట్టి లోక్‌సభ ఎన్నికల్లో గాలి ఎటువైపు వీస్తుందో స్పష్టంగా తెలపడానికి ఐదు రాష్ట్రాల్లో కనీసం నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని పైలట్ చెప్పారు. బీజేపీని ఓడించడానికి ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి పనిచేయడానికి కట్టుబడ్డాయని మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఇండియా కూటమి ప్రధానమంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తుందా అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... ఇప్పటివరకు అదే నిర్ణయమన్నారు. 2019లో మూడింట రెండొంతుల మంది ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేశారని, ఇప్పుడు ఆ కూటమి భాగస్వాముల్లో మూడింట రెండొంతుల మంది కలిసి పనిచేస్తుండటం బీజేపీని ఆందోళనకు గురిచేస్తోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గెలవడం అంత సులువు కాదని వారికి కూడా తెలుసునని చెప్పారు. చిన్న చిన్న విభేదాలు ఉన్నప్పటికీ కూటమి భాగస్వాములు బలంగా ఉన్నారన్నారు. దేశానికి ప్రత్యామ్నాయం అవసరమని, ఇండియా కూటమే ఆ ప్రత్యామ్నాయం అని పైలట్ స్పష్టం చేశారు. కూటమి పార్టీల్లో చీలికలు ఏర్పడతాయన్న చర్చను తోసిపుచ్చిన పైలట్, కూటమిలోని పార్టీలన్నీ బీజేపీని ఓడించాలనే అతిపెద్ద జాతీయ లక్ష్యానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. 'భారత కూటమి చాలా బలంగా ఉంది, మా పార్టీ అధ్యక్షుడు ఖర్గే చాలా మందిని సంప్రదించారు. రాబోయే కాలంలో, కూటమి పక్షాలు మరింత సమన్వయంతో చేసే వ్యూహరచన, ప్రచారం, పనితీరును మీరు చూస్తారు' అని పైలట్ పేర్కొన్నారు.

ఓట్ల కోసం హామీలాట!

- ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మోదీ మాటలు లబ్ధి కోసమేనా...
- ఇప్పటికే తెలంగాణలో బీసీ సీఎం అంటూ బీజేపీ ప్రకటన

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ, ఎస్సీ ఓట్లకు గాలం వేసేందుకు నానా తంటాలు పడుతోంది. బీసీ సీఎం, ఎస్సీ వర్గీకరణ అంటూ హామీలు ఇచ్చింది. అయితే ఇందులో ఆ పార్టీ, దాని నాయకుల చిత్తశుద్ధి ఎంతనేది ప్రశ్నే. మాదిగల చిరకాల డిమాండ్ ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉన్నామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభలో ప్రధాని ప్రసంగించారు. వర్గీకరణ అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉందని, మాదిగలకు న్యాయం జరగడానికి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో తాను పోరాడతానని చెప్పారు. 30 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. మాదిగ ఉప కులాల ఆత్మగౌరవాన్ని కాపాడతామని, ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేస్తామని చెప్పారు. ఇదే సభలో ప్రధాని మాట్లాడుతూ దేశంలో బీజేపీ చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను తూర్పారపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి ప్రకటనలు చేయడం రాజకీయ లబ్ధి కోసమేనని ప్రచారం జరుగుతోంది. మొన్న బీసీల సభ, నిన్న మాదిగల విశ్వరూప సభ పేరుతో ప్రధాని మోదీ బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని, ఎస్సీ వర్గీకరణకు పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇవ్వడం రాజకీయంగా బీజేపీకి లాభమేనా అన్నది ప్రశ్న. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ ప్రధాన మంత్రి వర్గీకరణ డిమాండ్ చేయడం ఏమిటని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్సీ వర్గీకరణ అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉంది.

గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దీనిపై వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని సుప్రీం కోర్టుకు వెళ్లారు. 2004లో సుప్రీం కోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పులో రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు రాష్ట్రపతి జారీ చేసే జాబితాలోని అంశమని, అందువల్ల షెడ్యూల్ కులాల వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం లేదని స్పష్టం చేసింది. దీని ప్రకారం ఎస్సీ వర్గీకరణకు బ్రేక్ పడింది. అయితే దీనికి పూర్తి భిన్నంగా జస్టిస్ అరుణ్ మిశ్రా నాయకత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే అధికారం ఉందని తీర్పు చెప్పింది. రెండు విభిన్న తీర్పులు రావడం రెండింటిలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇవ్వడం వల్ల వర్గీకరణ అంశం ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి రిఫర్ చేశారు. ప్రస్తుతం తీర్పు రావాల్సి ఉంది. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధమైనదే కానీ వర్గీకరణ అధికారాల విషయంలోనే భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. తీర్పుల విషయం న్యాయపరమైన అంశం అలా ఉంటే ప్రధాని అనుకుంటే పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా బిల్లు తీసుకు రావచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. అవసరమైతే వర్గీకరణ అంశంలో రాష్ట్రాలు నిర్ణయం తీసుకునే అధికారం కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయవచ్చు. ఏది ఏమైనప్పటికీ, తెలంగాణలో ప్రతి నియోజకవర్గంలో ఉన్న మాదిగల ఓట్లు బీజేపీకి పడితే తాము గెలిచే స్థానాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు. తెలంగాణలో ప్రధాని హామీ బీజేపీకి ఓట్ల రూపంలో రాజకీయ లబ్ధి చేకూరుతుందా అనేది ప్రశ్నార్థకమే.

రాజస్తాన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కన్నుమూత

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కరణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యరి గుర్మీత్ సింగ్ కూనెర్ అస్వస్థతతో కన్నుమూశారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్టు పార్టీ నేతలు బుధవారం తెలిపారు. 75 ఏళ్ల కూనెర్ ప్రస్తుతం కరణ్‌పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈనెల 12న ఆయన ఎయిమ్స్‌లో చేరారు. హైపర్‌టెన్షన్, మూత్రపిండాలు దెబ్బతినడంతో కూనెర్ కన్నుమూసినట్టు ఎయిమ్స్ జారీ చేసిన పత్రం పేర్కొంది. గుర్మీత్ సింగ్ కూనెర్ మృతికి రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ సంతాపం తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కూనెర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కాగా, గుర్మీత్‌సింగ్ మృతితో ఈ నియోజకవర్గం ఎన్నికను ఈసీ వాయిదా వేసింది.

ఎన్నికలప్పుడే గుర్తుకొస్తామా?

బాన్స్‌వారా: ఎన్నికలు వస్తే తప్ప తమ గురించి నాయకులకు పట్టదని రాజస్తాన్, బాన్స్‌వారా జిల్లాలోని చాచాకోట, పృథ్వీఘర్ గ్రామాల్లోని గిరిజనులు అసహనం వ్యక్తం చేశారు. తమ సమస్యలు, సంక్షేమం గురించి ఎవరూ పట్టించుకోరని, కనీస వసతులకూ తాము నోచుకోవడం లేదన్నారు. ఓట్లు అడగడం కోసం నేతలు వస్తారు ఆ తర్వాత కనుమరుగవుతారని వ్యాఖ్యానించారు. 'మేము అభివృద్ధిని ఆశించి ఓటేస్తాం, మంచి రోడ్లు, హాండ్ పంపులు వస్తాయని భావిస్తాం కానీ ఎన్నికలప్పుడు మాత్రమే నేతలు మెరుస్తారు. ఆ తర్వాత దరిదాపుల్లో కనిపించరు' అని పృథ్వీఘర్‌కు చెందిన 50ఏళ్ల ప్రభు తెలిపారు. రాజస్తాన్‌లో ఈనెల 25న అసెంబ్లీ ఎన్నికలు జరగన్నాయి. కాంగ్రెస్, బీజేపీతో పాటు కొత్తగా ఏర్పాటైన భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ) గిరిజనులపై దృష్టిని కేంద్రీకరిస్తోంది.

మోదీ రోడ్‌షోను వీక్షించిన విదేశీ దౌత్యవేత్తలు

ఇండోర్ : మధ్యప్రదేశ్‌లో ఈనెల 17న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇండోర్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోడ్‌షోను ముగ్గురు సభ్యుల విదేశీ దౌత్యవేత్తల ప్రతినిధి బృందం వీక్షించింది. వారిలో ఒకరు భారత్‌లో ఎన్నికలు ఒక పండుగలాంటిది అని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో ఈ ప్రతినిధి బృందానికి ప్రత్యక్ష అనుభవం కలిగిందని బీజేపీ కార్యకర్త ఒకరు బుధవారం అన్నారు.

ఆస్ట్రేలియన్ దౌత్య కార్యాలయంలోని సెకండ్ సెక్రటరీ మైఖేల్ రీస్, టాంజానియా దౌత్య కార్యాలయంలోని మంత్రి (కాన్సులర్ వ్యవహారాలు) బాజిల్ ఎం లియాకినానా, అలాగే జపాన్ రాయబార కార్యాలయంలో రెండవ సెక్రటరీ మయూమి సుబాకిమోటో అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ప్రచారాన్ని చూసిన ప్రతినిధి బృందంలో ఉన్నారని ఆ అధికారి వివరించారు. 'మంగళవారం సాయంత్రం ఇండోర్‌లో ప్రధాని రోడ్‌షో చూశాము' అని జపాన్ దౌత్యవేత్త మయూమి సుబాకిమోటో పీటీఐకి చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు బీజేపీ ఎలా చేరువవుతుందో తెలుసుకోవడానికి స్థానిక నేతలను కూడా కలిశామని ఆమె అన్నారు. భారతదేశంలో ఎన్నికలు ప్రజలు జరుపుకునే పండుగ లాంటివని మయూమి తెలిపారు.

నేపాల్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, డెన్మార్క్, సింగపూర్ నుంచి దౌత్య ప్రతినిధులతో కూడిన ఇదే విధమైన ప్రతినిధి బృందం 2022 నవంబరు, డిసెంబరులో వరుసగా రెండు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రచారాన్ని అర్థం చేసుకోవడానికి హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌ను సందర్శించిందని బీజేపీ కార్యనిర్వాహకుడు తెలిపారు. 2021లో 43వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా ప్రారంభించిన 'బీజేపీని తెలుసుకోండి' కార్యక్రమంలో భాగంగా ఇది జరిగింది.

కాంగ్రెస్‌పై ప్రజల్లో ఆగ్రహం

ప్రధాని మోదీ



న్యూఢిల్లీ : అభివృద్ధి చెందిన రాష్ట్రం, దేశం కోసం బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని మధ్య ప్రదేశ్‌లోని ఓటర్లకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ వంశపారంపర్య ప్రతికూల రాజకీయాలపై ప్రజలు చాలా కోపంగా ఉన్నారని నొక్కి చెప్పారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో తన పోస్ట్‌లలో, మోదీ... చత్తీస్‌గఢ్ ఓటర్లకు బీజేపీ తన వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తుందని ప్రమాణం చేశారు. 'ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూడనుంది. ప్రజలు బీజేపీ సుపరిపాలనను నమ్ముతున్నారు తప్ప కాంగ్రెస్ బూటకపు వాగ్దానాలను నమ్మరని అన్నారు. చత్తీస్‌గఢ్‌లో రాబోయే బీజేపీ ప్రభుత్వం వారి ఆకాంక్షలకు, రాష్ట్ర శ్రేయస్సుకు దోహదపడుతుందని నేను ప్రజలకు హామీ ఇస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు. మధ్య ప్రదేశ్‌ను 21వ శతాబ్దానికి చెందిన అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని బీజేపీ మాత్రమే చేయగలదని, ప్రజలకు బీజేపీపై అచంచల విశ్వాసం ఉందని ఎంపీ ఓటర్లకు సందేశంలో పేర్కొన్నారు. మధ్య ప్రదేశ్ ప్రజలు డబుల్ ఇంజన్ ప్రభుత్వ ప్రయోజనాలను చూశారని, దాని అవసరాన్ని అభినందిస్తున్నారని, కాంగ్రెస్ ప్రతికూల రాజరిక రాజకీయాలపై వారి తీవ్ర కోపాన్ని తన బహిరంగ సభలలో తాను చూశానని మోదీ అన్నారు. రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్‌కు దూరదృష్టి, కార్యచరణ లేదని అన్నారు. మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజు, చత్తీస్‌గఢ్ ఎన్నికల రెండవ, చివరి దశ సందర్భంగా మోదీ నుంచి ఈ సందేశం వచ్చింది. కాగా, ఈ రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ పోరు సాగిస్తున్నాయని చాలా మంది పరిశీలకులు అభిప్రాయపడ్డారు, చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, మధ్య ప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నాయి. మధ్య ప్రదేశ్‌లో మహిళా ఓటర్లు బీజేపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే తమ ప్రాధాన్యతగా మార్చుకున్నారని, అలాగే చత్తీస్‌గఢ్‌ను అభివృద్ధి చేయడంలో తాము కూడా ముందున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ అభివృద్ధి నమూనాలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ యువకులు చేరుతున్న తీరు ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని, యువతలో ఉన్న ఈ బలం మార్పునకు కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందన్నారు.

మోదీవి దిగజారుడు వ్యాఖ్యలు: గెహ్లాత్

జైపూర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'మూర్ఖోంకే సర్దార్' (మూర్ఖుల నాయకుడు) అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించడాన్ని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ తీవ్రంగా ఖండించారు. జైపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని స్థాయిని దిగజార్చే విధంగా మోదీ వ్యాఖ్యాలున్నాయన్నారు. గౌరవప్రదమైన పదవిలో ఉండి, ఇలాంటి మాటలు మాట్లాడితే... ఆయన్నుంచి ఏమి ఆశించగలమని ప్రశ్నించారు. 'లాల్ డైరీ' ఆరోపణలను ప్రస్తావిస్తూ... ఈ కుట్ర భారత ప్రభుత్వంలోని హోంమంత్రిత్వ శాఖలో జరిగినట్లు నేను భావిస్తున్నాను. దానికి అక్కడ 'లాల్ డైరీ' అని పేరు పెట్టారు... మా మంత్రితో కుమ్మక్కై బీజేపీ నేతలు కుట్ర పన్నారు' అని గెహ్లాత్ అన్నారు. గెహ్లాత్ మంత్రి వర్గం నుంచి తొలగించిన రాజస్థాన్ మంత్రి రాజేంద్ర గూడా... తన వద్ద ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా 'ప్రశ్నార్థకమైన ఆర్థిక లావాదేవీలు' ఉన్న రెడ్ డైరీ ఉందని తెలిపారు. మరోవైపు రాహుల్ గాంధీపై ప్రధాని చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. మంగళవారం, మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... రాహుల్ గాంధీ పేరు ప్రస్తావించకుండా రాహుల్ గాంధీని 'మూర్ఖోంకే సర్దార్' అని పిలుస్తూ ప్రధాని ఆయనను ఎద్దేవా చేశారు. దీనిపై చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ స్పందిస్తూ...ప్రధాని అహంకారిగా మారారని అన్నారు. ఆయన ప్రధాని... ఏదైనా మాట్లాడగలరు కానీ ఇతరులను దూషిస్తున్న తీరు అతని అహంకారాన్ని తప్ప మరేమీ చూపదన్నారు.

బాఘేల్‌కు ఈడీ అరెస్టు తప్పదు: హిమంత

రాయ్‌పూర్: మహదేవ్ బెట్టింగ్ యాప్ నిర్వాహకుల నుంచి రూ.508 కోట్లు తీసుకున్నారన్న ఆరోపణలపై చత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బాఘేల్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంటుందని అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అన్నారు. ఈ కేసులో ఇప్పటికే చాలామందిని ఈడీ అదుపులోకి తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి భూపేష్ బాఘేల్‌కు ఈడీ సమయం ఇచ్చిందని, ఎన్నికల తరువాత ఈడీ రంగంలోకి దిగుతుందని హిమంత చెప్పారు. బెట్టింగ్ కుంభకోణంలో ముఖ్యమంత్రిని విచారిస్తుందన్నారు. జైలుకు వెళ్లే విషయం బాఘేల్‌కు కూడా తెలుసునని, తనతో పాటు మరో 10 మందిని తీసుకెళ్లాలని ఆయన అనుకుంటున్నారని చెప్పారు. బఘేల్ రూ.508 కోట్లు స్వీకరించినట్లు ఈడీ కోర్టుకు చెప్పిందన్నారు. భూపేష్‌ని లార్డ్ మహదేవ్ విడిచిపెట్టబోరని హెచ్చరించారు. మహాదేవ్ యాప్‌తో బీజేపీకి సంబంధాలు ఉన్నాయని, అందుకే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బఘేల్ ఇటీవల విమర్శించారు. ఇటీవల ఈడీకి దొరికిన ఒక 'కొరియర్'తో ఈ పరిణామం వెలుగులోకి వచ్చింది. ఎన్నికల కోసం ఆ యాప్ నిర్వాహకుల నుంచి రూ.508 కోట్లు అందుకున్నారని భూపేష్ బాఘేల్‌పై ఆరోపణలు వచ్చాయి.

'లవ్ జిహాద్' సాగనివ్వం

చత్తీస్‌గఢ్ ప్రచారంలో అమిత్ షా

బెమెతర : చత్తీస్‌గఢ్‌లోని బెమెతర జిల్లా 'లవ్ జిహాద్' కేంద్రంగా మారిందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎవరూ ఇలాంటి చర్యకు సాహసించరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం అన్నారు. ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ బెట్టింగ్ యాప్‌నకు పేరు పెట్టడం ద్వారా మహాశివుడిని అవమానించారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రెండో దశ ఎన్నికల ప్రచారానికి చివరి రోజున బెమెతర జిల్లాలోని సాజా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో ప్రసంగించిన అమిత్ షా, దుర్గ్ డివిజన్‌ను విద్యా కేంద్రంగా కాకుండా 'బెట్టింగ్‌ల కేంద్రంగా' బాఘెల్ మార్చారని ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జిల్లాలోని బీరాన్‌పూర్ గ్రామంలో జరిగిన మత ఘర్షణలో మరణించిన భునేశ్వర్ సాహు తండ్రి ఈశ్వర్ సాహును సాజా స్థానం నుంచి బీజేపీ పోటీకి దింపింది. 'ఈశ్వర్ సాహు ఒక అభ్యర్థి మాత్రమే కాదు. న్యాయం కోసం పోరాటానికి చిహ్నం. భూపేశ్ పాలనలో సాహు కుమారుడు భునేశ్వర్ సాహును మతతత్వ శక్తులు కొట్టి చంపాయి. తనకు న్యాయం చేయాలని అడగవద్దని కోరుతూ భూపేశ్‌కు చెందిన ప్రజలు ఈశ్వర్ జీకి చెక్కు, ఉద్యోగం ఇచ్చారు. కానీ అందుకు నిరాకరించి న్యాయం కోరినందుకు ఈశ్వర్ జీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని షా అన్నారు. 'భునేశ్వర్ సాహుకు న్యాయం చేయడం మా బాధ్యత. చట్టాన్ని ఉల్లంఘించడానికి ఎవరూ అనుమతించబడరు. భునేశ్వర్ సాహు హత్యకు గురైన ప్రతి ఒక్కరినీ జైలుకు పంపుతాం. భూపేశ్ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ మొదలైంది.

ప్రజలు తమ ఓట్లు వేయడం ద్వారా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. భునేశ్వర్ సాహుకు న్యాయం చేస్తామని, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే వారికి గుణపాఠం చెబుతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత దూషిస్తూ, భూపేశ్ బాఘెల్ అధ్వర్యంలో బెమెతర 'లవ్ జిహాద్' కేంద్రంగా మారిందని షా అన్నారు. లవ్ జిహాద్ అనేది హిందూ స్త్రీలను వివాహం ద్వారా మత మార్పిడికి ఆకర్షించడానికి ముస్లిం పురుషులు చేసిన పన్నాగాన్ని ఆరోపించడానికి మితవాద కార్యకర్తలు తరచుగా ఉపయోగించే పదం. సాహు, కుర్మీ, గోండు సంఘాలు దాని (లవ్ జిహాద్) లక్ష్యంలో ఉన్నాయని, భూపేశ్ బాఘెల్ ప్రభుత్వం నిద్రలో ఉందని ఆయన అన్నారు. అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన షా... చత్తీస్‌గఢ్‌ను కాంగ్రెస్‌కు కలెక్షన్ సెంటర్‌గా, ఏటీఎంగా మార్చారని ఆరోపించారు.

వీడని ఉత్కంఠ

మూడు రోజులు దాటినా సొరంగంలోనే కార్మికులు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో నిర్మాణంలో ఉన్న సొరంగం ఆదివారం ఉదయం కుప్పకూలంతో తలెత్తిన ఉత్కంఠ మూడు రోజులు దాటినా ఇంకా కొనసాగుతోంది. సొరంగంలో చిక్కుకుపోయిన 40 మంది కార్మికులను వెలికితీసేందుకు సహాయబృందాలు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నప్పటికీ వాతావరణ ప్రతికూలత, మంగళవారం రాత్రి మళ్లీ కొండచరియలు విరిగిపడటంతో సహాయక యత్నాల్లో ఆటంకం తలెత్తింది. దీంతో సొరంగం బయట నిరీక్షిస్తున్న కార్మికుల కుటుంబసభ్యుల్లో ఆందోళన అంతకంతకూ తీవ్రమవుతోంది. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకురావడానికి సొరంగం లోపల 900 ఎంఎం పైపును అమర్చడం ద్వారా మార్గం ఏర్పాటు చేసే ప్రయత్నం మూడు రోజులుగా జరుగుతోంది.

సొరంగాన్ని మూసివేసి...21 మీటర్ల శ్లాబ్‌ను తొలగించినప్పటికీ 19 మీటర్ల పాసేజ్‌ను ఇంకా క్లియర్ చేయాల్సి ఉంది. దీంతో సహాయచర్యలకు అవసరమైన కొత్త డ్రిల్లింగ్ మిషన్, ఇతర సామగ్రిని న్యూఢిల్లీ నుంచి విమానం ద్వారా రప్పించే చర్యలు చేపట్టారు. దీనికి ముందు సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికులందరినీ బుధవారం కల్లా సురక్షితంగా బయటకు తీసుకువస్తామని ఉత్తరాఖండ్ జిల్లా మెజిస్ట్రేట్ అభిషేక్ రుహెలా చెప్పారు. అయితే, మంగళవారం రాత్రి కొండచరియలు విరిగిపడటంతో కొత్త డ్రిల్లింగ్ మిషన్‌తో తిరిగి పనులు చేపట్టబోతున్నట్టు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం తెలిపింది. దీంతో సహాయక పనుల్లో జరుగుతున్న జాప్యంతో కార్మికుల కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అయితే, సొరంగంలో చిక్కుకున్న కార్మికులతో వాకీటాకీతో మాట్లాడామని, సుమారు ఐదు నుండి ఆరు రోజులు జీవించేందుకు సొరంగం విభాగంలో తగినంత ఆక్సిజన్ ఉందని ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి రంజిత్ కుమార్ సిన్హా చెప్పారు.

ఉపాధ్యాయుల శిక్షణకు 100 కోట్ల డాలర్లు

అప్పుడే అద్భుత ఫలితాలు: నారాయణమూర్తి

బెంగళూరు: ప్రాథమిక, మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ కోసం భారత్ ఏటా 100 కోట్ల డాలర్లు వెచ్చించాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి సూచించారు. 20 ఏళ్ల పాటు ఇది కొనసాగితే... అద్భుత ఫలితాలు సాధించొచ్చని అభిప్రాయపడ్డారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ బుధవారం నిర్వహించిన ఇన్ఫోసిస్ ప్రైజ్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యేటా ఈ ఫౌండేషన్ ఆరు రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అవార్డులు అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం వేగవంతమైన ఫలితాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నారాయణమూర్తి సూచించారు. అందుకోసం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా సైన్స్, సాంకేతికత, గణితం, ఇంజినీరింగ్ రంగాల్లో విజయవంతమైన 10 వేల మంది పదవీ విరమణ పొందిన అధ్యాపకులను తీసుకురావాలని ఆయన తెలిపారు. వారితో దేశవ్యాప్తంగా 2,500 'ట్రైన్ ది టీచర్' కళాశాలలు నెలకొల్పాలని, ఈ శిక్షణా కార్యక్రమాలు ఏడాది పొడవునా కొనసాగాలని సూచించారు. ప్రతి నలుగురు శిక్షకులు ఏటా 100 మంది ప్రాథమిక, 100 మంది మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వగలరని వివరించారు. ఈ విధానాన్ని అమలు చేయడం వల్ల ఏటా 2.50 లక్షల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వొచ్చని తెలిపారు. దీనికోసం ఏడాదికి బిలియన్ డాలర్ల చొప్పున 20 ఏళ్లకు 20 బిలియన్ డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని చెప్పారు. అధ్యాపకులు, పరిశోధకులకు మెరుగైన వేతనాలివ్వాలని నారాయణమూర్తి సూచించారు. జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపా సమాఖ్య దేశాల తరహాలో నూతన ఉత్పత్తులు, సేవలు, ప్రక్రియలను అభివృద్ధి చేసే స్థాయికి భారత్ ఎదగాలని ఆకాంక్షించారు. కష్టపడేతత్వం, ప్రామాణిక ఉత్పాదకత, క్రమశిక్షణ, ఆతృతతో కూడిన ఆలోచనా విధానం నుంచే ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, వాటిని అలవర్చుకునే ప్రయత్నం చేయాలని ప్రోత్సహించారు. 'ఇన్ఫోసిస్ ప్రైజ్' కింద 'ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్' ఏటా ఆరు రంగాల్లో అవార్డులు ఇస్తోంది. విజేతలకు లక్ష డాలర్ల నగదుతో పాటు బంగారు పతకాన్ని బహూకరిస్తారు. ఈసారి ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో సచ్చిదానంద త్రిపాఠి, హ్యూమానిటీస్‌లో జాహ్నవి, లైఫ్ సైన్సెస్‌లో అరుణ్ కుమార్ శుక్లా, మేథమేటికల్ సైన్సెస్‌లో భార్గవ్ భట్, ఫిజికల్ సైన్సెస్‌లో ముకుంద్ థట్టై, సోషల్ సైన్సెస్‌లో కరుణ మంతెన అవార్డులు పొందారు.

'మయితే ఉగ్ర సంఘాల'పై నిషేధం పదేళ్లు పొడిగింపు

న్యూఢిల్లీ : సాయుధ పోరాటం ద్వారా భారతదేశం నుంచి మణిపూర్ విడిపోవడాన్ని సమర్థించినందుకు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ఎనిమిది 'మయితే తీవ్రవాద సంస్థల' పై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఉన్న నిషేధాన్ని పొడిగించింది. 'ఉపా' చట్టం ప్రకారం, మణిపూర్ ప్రజలను వేర్పాటు కోసం ప్రేరేపిస్తున్నారని ఆరోపిస్తూ కేంద్రం ఆ గ్రూపులను 'చట్టవిరుద్ధమైన గ్రూపులు' అని నవంబరు 13 విడుదల చేసిన ప్రభుత్వ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ ఎనిమిది గ్రూపుల్లో... పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ), దాని రాజకీయ విభాగం, రివల్యూషనరీ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్‌పీఎఫ్), యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యూఎన్ఎల్ఎఫ్), దాని సాయుధ విభాగం మణిపూర్ పీపుల్స్ ఆర్మీ (ఎంపీఏ), పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీపాక్ (పీఆర్ఈపీఏకే), దాని సాయుధ విభాగం 'రెడ్ ఆర్మీ', కంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (కేసీపీ), దాని సాయుధ విభాగం, దీనిని 'రెడ్ ఆర్మీ' అని కూడా పిలుస్తారు. కంగ్లీ యాయోల్ కాన్బా లుప్ (కేవైకేఎల్), కోఆర్డినేషన్ కమిటీ (కోర్‌కామ్), అలయన్స్ ఫర్ సోషలిస్ట్ యూనిటీ కాంగ్లీపాక్ (ఏఎస్‌యూకే) ఉన్నాయి. ఈ సంస్థలు తమ లక్ష్యాలను సాధించడానికి సాయుధ మార్గాలను ఉపయోగించుకోవడం ద్వారా భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతకు భంగం కలిగించే కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాయని నోటిఫికేషన్ పేర్కొంది. ఈ క్రమంలో మణిపూర్‌లో భద్రతా బలగాలు, పోలీసులు, పౌరులపై దాడులు చేసి చంపేస్తున్నారు. వారు నిధుల సేకరణ కోసం పౌర జనాభాను బెదిరించడం, దోపిడీ చేయడం, దోచుకోవడం వంటి చర్యలకు కూడా పాల్పడుతున్నారని తెలిపింది. నవంబరు 13 నుంచి అమలులోకి వచ్చిన పొడిగించిన నిషేధం 10 సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది. మునుపటి 2018 నోటిఫికేషన్ ప్రకారం, జనవరి 1, 2013 నుంచి జులై 31, 2018 వరకు 756 హింసాత్మక సంఘటనలలో ఈ సంస్థలు పాల్గొన్నాయి. 35 మంది భద్రతా సిబ్బందితో సహా 86 మందిని చంపారని వెల్లడించింది.

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే

రాజ్యాంగాన్ని మార్చేస్తారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రూపొందించిన దేశ రాజ్యాంగాన్ని సైతం పూర్తిగా మార్చేసి తమ ఆర్‌ఎస్‌ఎస్ అజెండాగా చేసే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ప్రగతిశీల, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా 'ఇండియా' కూటమిని గెలిపించవలసిన ఆవశ్యకత ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త, తెలుగు నాట నాస్తికకోద్యమ నిర్మాత గోపరాజు రామచంద్రరావు (గోరా) 121వ జయంతి సభ బుధవారం స్థానిక బెంజిసర్కిల్ సమీపంలోని నాస్తిక కేంద్రంలో నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన రామకృష్ణ 'లౌకిక రాజ్య పరిరక్షణలో అభ్యుదయవాదుల పాత్ర' అంశంపై ప్రసంగించారు. మోదీ పాలనను ప్రశ్నించిన మేధావులు, హేతువాదులు దబోల్కర్, గోవింద పన్సారే, గౌరీ లంకేశ్ వంటి వారిని హత్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కశ్మీర్ అంశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే ఎన్నికలు అంటూ తన సొంత ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో పరిపాలన సాగిస్తోందన్నారు. కేంద్ర మంత్రివర్గంలో, ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీలో ఒక్క ముస్లిం ప్రాతినిధ్యం లేకుండా చేశారన్నారు. ప్రముఖ నాస్తికులు మోతుకూరి అరుణ కుమార్ మాట్లాడుతూ విద్యా రంగంలో సంస్కరణల పేరుతో విశ్వవిద్యాలయాల స్థాయిలో కాషాయకరణ చేస్తున్నారని, మొఘల్ చరిత్ర, భగత్ సింగ్, గాంధీ చరిత్ర, డార్విన్ సిద్ధాంతం వంటి అంశాలు తొలగిస్తున్నారని విమర్శించారు. మూఢనమ్మకాల నిర్మూలన కోసం సంస్కరణోద్యమం చేపట్టిన గోరా, పెరియార్, త్రిపురనేని, గురజాడ వంటి వారిని ఆదర్శంగా తీసుకుని నాస్తిక ఉద్యమాన్ని ముందుకు నడిపించే బాధ్యత నేటి తరంపై ఉందని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ వైద్యులు జి.సమరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో కులమతాల ధ్రువీకరణ లేని నాస్తికుల కోసం ప్రత్యేక కాలం ఉంచాలన్నారు. లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకతపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞాపన ఇస్తున్నామని తెలిపారు. నాస్తిక కేంద్రం నుంచి నిత్యం చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. ఇస్కఫ్ నాయకులు మహబూబ్ ఆజం మాట్లాడుతూ గోరా కుటుంబం చేస్తున్న సామాజిక అభివృద్ధి కృషిని గుర్తు చేశారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య ప్రపంచ యుద్ధాల వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ అభ్యుదయ గేయాలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జి.నియంత, డాక్టర్ మారు, రష్మి సందేశం ఇచ్చారు.

30 గంటల దీక్షకు సీపీఎం మద్దతు కోరిన సీపీఐ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, కృష్ణా జలాల పున:పంపిణీతో రాష్ట్ర నీటి హక్కులపై కేంద్రం చేస్తున్న కుట్రలకు నిరసనగా నవంబర్ 20, 21 తేదీలలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక వద్ద చేపడుతున్న 30 గంటల సామూహిక నిరసన దీక్షకు మద్దతివ్వాలని సీపీఎం నేతలను సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుని కలిసి మద్దతు కోరారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఉన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాంభూపాల్ తదితరులు ఉన్నారు.

రేపు నంద్యాలలో ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయండి

దుర్గాభవాని పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభల జయప్రదానికి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని పిలుపునిచ్చారు. ఈనెల 17, 18, 19 తేదీలలో నంద్యాలలో మహాసభలు జరగుతాయని తెలిపారు. ప్రారంభ రోజు(17వ తేదీ)న జరిగే మహిళల ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రదర్శన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు టెక్కి మార్కెట్ యార్డు నుంచి బయలుదేరి పద్మావతి నగర్-శ్రీనివాస సెంటర్ మీదుగా మున్సిపల్ టౌన్‌హాలు వరకు సాగుతుందని తెలిపారు. మున్సిపల్ టౌన్‌హాల్ (గీతాముఖర్జీ నగర్)లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈనెల 18,19 తేదీల్లో హారూన్ ఫంక్షన్‌హాల్ (కొండపల్లి కోటేశ్వరమ్మ ప్రాంగణం)లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. మహాసభలకు వచ్చే వారి కోసం ఆమె కొన్ని సూచనలు కూడా చేశారు. రైల్వేస్టేషన్ నుంచి వచ్చే వారి కోసం ఎన్టీఆర్ షాదిఖానా (ఆత్మకూరు బస్టాండ్) వద్ద విడిది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సుల్లో వచ్చేవారు టెక్కి మార్కెట్ యార్డుకు రావాలన్నారు. బాబా ఫక్రుద్దీన్-94403 50327, ఆర్.సుగుణమ్మ-98487 57988, ఎన్.రంగనాయుడు-99665 44600ను సంప్రదించవచ్చని ప్రతినిధులకు దుర్గాభవాని సూచించారు.

రేపు నూజివీడుకు సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 17వ తేదీన ఏలూరు జిల్లా నూజివీడులో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. 2003కు ముందు అసైన్డ్ భూములకు హక్కు కల్పించడం, కొత్త అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. ఉదయం 9.45 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి నూజివీడు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో ప్రసంగం అనంతరం పట్టాల పంపిణీ సభకు హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి సీఎం చేరుకుంటారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలకు నంద్యాల ముస్తాబు

ప్రదర్శన... బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు

విశాలాంధ్ర-నంద్యాల: ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలకు నంద్యాల పట్టణం ముస్తాబయింది. జిల్లాల విభజన అనంతరం ఏర్పాటయిన నంద్యాల జిల్లా కేంద్రంలో మొదటిసారి ఈనెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న మహాసభలను జయప్రదం చేసేందుకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా సీపీఐ, ప్రజా సంఘాలైన విద్యార్థి, యువజన, కార్మిక, మహిళా సంఘాల నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. మహాసభల విజయవంతం కోసం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రెండు సార్లు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని నంద్యాల జిల్లా కేంద్రానికి వచ్చి ఏర్పాట్లకు సహకరించారు. పూర్తి స్థాయిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్ నేతృత్వంలో నంద్యాల పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సుబ్బరాయుడు, ఏఐటీయూసీ నంద్యాల పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సుగుణమ్మ, నారాయణమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్య ప్రతాప్, ఎ.ధనుంజయుడు, సీపీఐ గోస్పాడు మండల కార్యదర్శి హరి, మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీదేవి, ఆళ్లగడ్డ ప్రాంతంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.భాస్కర్, రుద్రవరం మండల కార్యదర్శి పి.చిన్ననరసింహులు, బనగానపల్లెలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి శివబాలకృష్ణ, సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, సుబ్బారెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కళింగి రాముడు, సీపీఐ బేతంచెర్ల మండల కార్యదర్శి ఎన్.భార్గవ్, సహాయ కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి, డోన్ నియోజకవర్గ ప్రాంతంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, సీపీఐ డోన్ మండల, పట్టణ కార్యదర్శులు పులి శేఖర్, బి.నారాయణ, ప్యాపిలి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, మండల కార్యదర్శి పి.వెంకటేష్, మహానందిలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటారాముడు నాయకత్వంలో మహేశ్వరమ్మ, నందికొట్కూరులో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వి.రఘురాంమూర్తి, పగిద్యాల మండల కార్యదర్శి మజీద్ జూపాడు బంగ్లాలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ మండల కార్యదర్శి వైబుద్దీన్, ఆత్మకూరు మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసులు, మహిళా సమాఖ్య నాయకురాలు స్వాతి, మూర్తి, మాబి, ప్రశాంత కుమారి, పాములపాడు మండలం కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి ప్రతాప్ రానా, మహిళా సమాఖ్య నాయకులతో పాటు అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే మహిళా నాయకులు మహాసభల విజయవంతం కోసం అన్ని వర్గాల ప్రజలను, ప్రజాప్రతినిధులను, వ్యాపార, విద్యాసంస్థలను కలిసి విరాళం సేకరిస్తున్నారు. మొదటి రోజు ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతం కోసం మహిళా సమాఖ్య శ్రేణులను సమీకరించడం, రెండు రోజుల పాటు 26 జిల్లాల నుంచి వచ్చే 500 మంది ప్రతినిధులకు వసతి, భోజనం, ఇతర ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే మహాసభను విజయవంతం చేయాలని నంద్యాల పట్టణంలో వాల్ పెయింట్లు పూర్తి చేసి, ప్రధాన ప్రాంతాల్లో ఫ్లెక్సీ బ్యానర్లు, జెండాలను కట్టారు. ఇక్కడ ప్రథమంగా జరిగే ఈ మహాసభల విజయవంతం కోసం ప్రముఖులతో కూడిన ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసుకొని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.సుగుణమ్మ, కోశాధికారి ఎన్.రంగనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆతిథ్యానికి పేరుగాంచిన నంద్యాల జిల్లా, పట్టణ ప్రముఖులు, వ్యాపారస్తులు, అన్ని రంగాల ప్రజలు ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు సహాయ సహకారాలను అందించాలని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.సుగుణమ్మ, కోశాధికారి ఎన్.రంగనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, నంద్యాల పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న విజ్ఞప్తి చేశారు.

సీపీఎం సీనియర్ నేత శంకరయ్య కన్నుమూత

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు: సీపీఎం

చెన్నై/న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు, తమిళనాడుకు చెందిన సీపీఎం సీనియర్ నేత ఎన్.శంకరయ్య బుధవారం కన్నుమూశారు. 102 ఏళ్ల శంకరయ్య అనారోగ్య సమస్యలతో చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఎన్.శంకరయ్య భౌతికకాయాన్ని ఆయన నివాసానికి తీసుకువెళ్లే ముందు పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం సీపీఎం కార్యాలయానికి తరలించనున్నట్లు ఆ పార్టీ పేర్కొంది. శంకరయ్య మృతి పట్ల సీపీఎం బుధవారం సంతాపం వ్యక్తం చేసింది. శంకరయ్య తమిళనాడుకు చెందిన మధురై లోని అమెరికన్ కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన తన చివరి పరీక్షలకు ముందు అరెస్టు కావడంతో ఆయన డిగ్రీని పొందలేక పోయాడు. శంకరయ్య స్వాతంత్ర్యం వచ్చే వరకు ఎనిమిదేళ్లు జైలు జీవితం గడిపారు. 1940లో కమ్యూనిస్టు పార్టీలో చేరిన ఆయన తమిళనాడులో అవిభక్త పార్టీకి కీలకమైన నిర్వాహకులలో ఒకరిగా మారారు. ఆ తర్వాత సీపీఎంను ఏర్పాటు చేసేందుకు పార్టీ నుంచి వైదొలిగిన 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులలో శంకరయ్య ఒకరు.

పలస్తీనాపై దురాక్రమణ ఆగాలి

- యావత్ ప్రపంచం అండగా నిలవాలి
- ఇన్సాఫ్ రౌండ్ టేబుల్‌లో అజీజ్ పాషా

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: యుద్ధాల వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, పలస్తీనాకు యావత్ ప్రపంచం అండగా నిలవాలని ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఇప్పటికే 11వేల మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. 'పలస్తీనాపై యుద్ధం ఆపండి. ప్రజల ప్రాణాలు కాపాడండి. యుద్ధం వద్దు, శాంతి ముద్దు' అంశంపై ఇన్సాఫ్ అధ్వర్యంలో కర్నూలులోని సూరజ్ హోటల్‌లో జరిగిన రౌండ్ టేబుల్‌లో అజీజ్ పాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రసూల్ అధ్యక్షత వహించారు. పలస్తీనాలో ఇజ్రాయిల్ దురాక్రమణ 40 రోజులుగా సాగుతోందని, ఇప్పటికే 11 వేల మందికిపైగా చనిపోతే, ఇందులో సుమారు 4వేల మంది చిన్నారులు ఉన్నారని అజీజ్‌పాషా ఆవేదన వ్యక్తంచేశారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పలస్తీనాకు ప్రపంచ దేశాలు అండగా నిలవాలని నొక్కిచెప్పారు. పెగాసస్ వంటి గూఢచర్య సాంకేతికతలతో సమాచారాన్ని రాబట్టి దేశాలపై పెత్తనం చేయాలని ఇజ్రాయిల్ చూస్తోంద న్నారు. భారత్‌లోనూ ప్రముఖుల సమాచారాన్ని తస్కరించేందుకు ఈ సాంకేతికత వినియోగమైందని గుర్తుచేశారు. యుద్ధాలు ఎక్కడ జరిగితే అక్కడకు ఆయుధాలు సరఫరా చేయడం ద్వారా అమెరికా పరోక్షంగా లబ్ధి పొందుతోందని ఆరోపించారు. ఇజ్రాయిల్‌కు అమెరికా అండగా ఉందన్నారు. పలస్తీనా ప్రజలకు మంచినీరు, ఆహారం అందడంలేదని, ఆసుపత్రుల్లో మందులు, ఆక్సిజన్ వంటివి లేక వేలాదిమంది ప్రాణాలు వదులుతున్నార న్నారు. ఐక్యరాజ్యసమితిలో పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడుల మీద చర్చ జరిగితే 120 దేశాలు వ్యతిరేకించాయన్నారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు అనేది ఇన్సాఫ్ విధానమన్నారు. ఐరాసలో జరిగిన ఓటింగ్‌లో భారత్ కూడా పలస్తీనాకు మద్దతిచ్చినట్లు అజీజ్‌పాషా తెలిపారు. పలస్తీనాకు మద్దతుగా కర్నూలులో భారీ ర్యాలీ చేపట్టాలని భావిస్తున్నామని, దీనిపై పెద్దలతో చర్చిస్తామని, పోలీసు అనుమతి వచ్చాక తేదీని ప్రకటిస్తామని రసూల్ వెల్లడించారు. సమావేశంలో మైనారిటీ నాయకులు రజాక్ షేక్ (వైసీపీ), కొత్తపేట మున్నా (కాంగ్రెస్), మైనార్టీ విద్యాసంస్థల అధినేత ముజాహిద్, టీడీపీ నాయకులు అబ్దుల్ సమీ, మౌలానా సమీవుల్లా, అబూబకర్ మసీదు ముతావల్లి బిలాల్ అహ్మద్, మహమ్మదీయ మసీదు ముతావల్లి మున్నా, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా కార్యదర్శి వి నాగరాజు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, శ్రీనివాసులు, మాజీ ఎమ్మార్వో రోషన్ అలీ, సిల్వర్ జూబ్లీ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపల్ షఫీ మహమ్మద్, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

ఫైనల్‌కు భారత్

ముంబై: ఐసీసీ ప్రపంచకప్ అందుకోవడానికి టీమిండియా ఒక్క అడుగు దూరంలో నిలిచింది. బుధవారం ఇక్కడి వాంఖడే స్టేడియంలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. గురువారం ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే రెండో సెమీఫైనల్ మ్యాచ్ విజేతతో టీమిండియా తలపడనుంది. ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ఈ నెల 19వ తేదీ ఆదివారం అహ్మదాబాద్‌లో జరగనుంది. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లు విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ చెలరేగగా....ఏడు వికెట్లు పడగొట్టి కివీస్ పతనాన్ని శాసించిన భారత పేసర్ మహమ్మద్ షమీ టీమిండియా విజయంలో ముఖ్య భూమిక పోషించాడు. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై టీమిండియా నిర్దేశించిన 398 పరుగుల విజయాన్ని అందుకోవడంలో కివీస్ బ్యాటర్లు తడబడ్డారు. తొలి వికెట్‌కు 30 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఓపెనర్లు కాన్వే (13), రచిన్ రవీంద్ర (13) జోడీని మహమ్మద్ షమీ పెవిలియన్‌కు పంపించాడు. తొలి ఓవర్ తొలి బంతికే షమీ కాన్వేను ఔట్ చేశాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే రచిన్ రవీంద్ర కూడా షమీ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. వీరిద్దరూ వికెట్ కీపర్ కేఎల్ రాహుల్‌కు క్యాచ్‌లు ఇచ్చారు. అయితే మూడో వికెట్‌కు కెప్టెన్ విలియమ్సన్ (73 బంతుల్లో 69 పరుగులు), మిచెల్ (119 బంతుల్లో 134 పరుగులు) కలిసి 181 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడం ద్వారా విజయంపై ఆశలు రేపారు. బుమ్రా, సిరాజ్, జడేజా, కుల్దీప్ వికెట్లు తీయడంలో విఫలమవగా... మరోసారి షమీ విలియమ్సన్, టామ్ లాథమ్(0) ఔట్ చేసి మ్యాచ్‌ను భారత్‌కు అనుకూలంగా మార్చాడు. అయితే సెంచరీతో చెలరేగిన మిచెల్ మాత్రం ఫిలిప్స్ (41) అండతో పోరాటం కొనసాగించినప్పటికీ రన్‌రేట్ మందగించడంతో కివీస్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు యత్నించి పెవిలియన్‌కు క్యూ కట్టారు. జట్టు స్కోరు 295 పరుగుల వద్ద ఉండగా బుమ్రా బౌలింగ్‌లో ఫిలిప్స్ జడేజా చేతికి చిక్కగా... ఆ తర్వాత వచ్చిన చాప్‌మన్ (2) కుల్దీప్ బౌలింగ్‌లో జడేజాకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో కివీస్ 44 ఓవర్లు ముగిసే సరికి ఆరు వికెట్లకు 300 పరుగులు చేసింది. ఈ తరుణంలో మరోసారి కివీస్‌ను షమీ దెబ్బతీశాడు. శతకవీరుడు మిచెల్ షమీ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి క్యాచ్ ఇచ్చాడు. ఈ క్యాచ్ కూడా జడేజానే అందుకోవడం విశేషం. ఆ తర్వాత సాంటర్న్ (9)ను సిరాజ్, సౌథీ (9), ఫెర్గ్యూసన్ (6)లను షమీ పెవిలియన్‌కు పంపాడు. దీంతో 48.5 ఓవర్లలో 327 పరుగులకు కివీస్ ఆలౌట్ అయింది. భారత్ బౌలర్లలో షమీ 7 వికెట్లు పడగొట్టగా, బుమ్రా, సిరాజ్, కుల్దీప్ ఒక్కొక్క వికెట్ పడగొట్టారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రోహిత్ సేన నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 397 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (117 పరుగులు), శ్రేయస్ అయ్యర్ (105) సెంచరీలతో చెలరేగారు. తొలుత ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ భారత్‌కు చక్కని ఆరంభాన్నిచ్చారు. తొలి ఓవర్ నుంచే రోహిత్ శర్మ దూకుడు కనబర్చాడు. శతక భాగస్వామ్యం దిశగా సాగుతున్న ఈ జోడీని సౌథీ విడదీశాడు. రోహిత్ (47 పరుగులు-29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) విలియమ్సన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు అదే జోరుతో అర్ధశతకం పూర్తి చేసుకుని సెంచరీ వైపు అడుగులు వేస్తున్న శుభ్‌మన్ గిల్ (65 బంతుల్లో 79 పరుగులు 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన శ్రేయస్ అయ్యర్‌తో కలిసి విరాట్ కోహ్లీ చూడచక్కని షాట్లతూ ఆడుతూ పరుగులు రాబట్టాడు. 42వ ఓవర్‌లో ఫెర్గూసన్ వేసిన బంతికి రెండు పరుగులు చేసిన కోహ్లీ వన్డేల్లో 50 సెంచరీలు పూర్తి చేసిన క్రికెటర్‌గా సరికొత్త చరిత్రను సృష్టిం చాడు. అంతేకాదు, ఇప్పటివరకూ సచిన్ పేరిట ఉన్న (49) సెంచరీల రికార్డును బద్దలు కొట్టాడు. సెంచరీ తర్వాత దూకుడు పెంచిన కోహ్లీ.. సౌథీ బౌలింగ్‌లో కాన్వేకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. దీంతో 163 పరుగుల మూడో వికెట్ భాగస్వా మ్యా నికి తెరపడింది. మరోవైపు శ్రేయస్ తన దూకుడు పెంచి శతకాన్ని అందుకున్నాడు. జోరుమీదున్న శ్రేయస్.. బౌల్ట్ బౌలింగ్‌లో మిచెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. సూర్యకుమార్ యాదవ్1(2 బంతులు) వచ్చీరాగానే ఔట్ కాగా, రిటైర్డ్ హర్టార్ట్ వెనుదిరిగిన శుభ్‌మన్ గిల్ (80 పరుగులు 66 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులు) తిరిగి వచ్చి కేఎల్ రాహుల్ 39 (20 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) కలిసి ఇన్నింగ్స్ పూర్తి చేశాడు. న్యూజిలాండ్ బౌలర్లలో టిమ్ సౌథీ మూడు వికెట్లు పడగొట్టినా కూడా100 పరుగులు సమర్పిం చుకున్నాడు. ట్రెంట్ బౌల్ట్‌కు ఒక వికెట్ దక్కింది.

శ్రేయస్ అయ్యర్ సరికొత్త చరిత్ర...

ఈ మ్యాచ్‌లో టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. వన్డే వరల్డ్‌కప్ టోర్నీ నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన ఆటగాడిగా అయ్యర్ రికార్డుల కెక్కాడు. సెమీఫైనల్‌లో కేవలం 67 బంతుల్లో సెంచరీ చేసిన అయ్యర్.. ఈ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. ఇప్పటివరకు ఈ రికార్డు ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్ పేరిట ఉంది. 2007 ప్రపంచకప్ ఫైనల్లో శ్రీలంకపై గిల్‌క్రిస్ట్ 72 బంతుల్లో సెంచరీ చేశాడు. తాజా మ్యాచ్‌తో గిల్లీ ఆల్‌టైమ్ రికార్డును అయ్యర్ బద్దలు కొట్టాడు. కాగా ఈ మ్యాచ్‌లో అయ్యర్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. 70 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లతో 105 పరుగులు చేశాడు. ఈ ప్రపంచ కప్‌లో అయ్యర్‌కు ఇది వరుసగా రెండో సెంచరీ.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.